సంపుటి : 9
సంచిక : 333
మంగళవారం
25 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999



## ఫుడ్ ప్రాసెసింగ్‌తో
# పంటలకు విలువ జోడిద్దాం

- అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు
- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- దేశీయ రకం హైబ్రిడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**నూజివీడు, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్న్‌కా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్‌కా సంస్థ ఏర్పాటు



చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

## ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం
# స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ

- సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ అర్హత సాధించేందుకు అవకాశం
- ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- అక్టోబర్ 11 నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు



**అమరావతి, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, తప్పనిసరి అర్హతగా మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సోమవారం 'స్పెషల్ ఏపీటెట్-ఆగస్టు 2026' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2011కు ముందు నియ మితులై, ఇంకా టెట్ అర్హత సాధించని వేలాది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్ష ద్వారా అర్హత పొందేందుకు ప్రభుత్వం అవకాశం

## తిరుపతిలో డ్రోన్ బ్యాటరీ తగిలి
# హోంమంత్రి అనితకు స్వల్పగాయం



**తిరుపతి, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్ కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు స్వల్ప గాయమైంది. ఓ డ్రోన్‌కు చెందిన బ్యాటరీ ప్రమాదవశాత్తు ఆమె చేతిపై పడటంతో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే, మిగతా .. 2లో..

## మాజీ మంత్రి కారుమూరికి
# 14 రోజుల రిమాండ్

### హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలింపు



**హైదరాబాద్, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఆయన్ను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా విధానంలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మద్యం రవాణా కేసులో విచారణ నిమిత్తం కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఆయన్ను అరెస్ట్ చేశారు. అరెస్టుకు ముందు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత ఈడీ కార్యాలయానికి తరలించారు. సోమవారం ఉదయం కోర్టులో మిగతా .. 2లో..

## హైదరాబాద్ నుంచి ఏపీకి అక్రమంగా
# చికెన్ వ్యర్థాల తరలింపు

### అడ్డుకున్న అధికారులు - 100 టన్నులు సీజ్



**హైదరాబాద్, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. ఏపీలోని చేపల చెరువులకు దాణాగా వేసేందుకు అక్రమ మార్గంలో తరలిస్తున్న దాదాపు 100 టన్నుల మాంసపు వ్యర్థాలను సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో సీజ్ చేశారు. నగరంలోని వివిధ కోళ్ల దుకాణాలు, మాంసం ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడే మిగతా .. 2లో..

# కాకినాడ బీచ్‌లో యువకుల గల్లంతు

### గాలింపు ముమ్మరం చేయాలన్న పవన్ కల్యాణ్
### బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యేకి పవన్ సూచన



**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని సముద్ర తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు యువకుల్లో ఇద్దరు భారీ అలల ఉద్ధృతికి గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆయన జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల మిగతా .. 2లో..

## ట్రంప్ తనయుడికి ఇరాన్ టీవీలో
# బెదిరింపులు



**ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడిపై టెహ్రాన్ ప్రత్యక్ష బెదిరింపులకు పాల్పడింది. ట్రంప్ చిన్న కుమారుడు బారెన్ ట్రంప్‌ను హత్య చేస్తామని మిగతా .. 2లో..

## పార్టీలో ఎవరైనా
# నిబంధనలు పాటించాల్సిందే


### కొండా సురేఖ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన



**హైదరాబాద్, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ మంత్రి కొండా సురేఖకు పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన ఉదంతంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించబోనని, క్రమశిక్షణా సంఘమే దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన మిగతా .. 2లో..

## శ్రావణమాసం మూడో శుక్రవారం
# కొత్త పార్టీని ప్రకటిస్తా

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



**ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరపున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు మిగతా .. 2లో..

## కుటుంబ విభేదాలను
# రాజకీయం చేస్తున్నారు

### కుమారుడి వివాదంపై జోగి రమేశ్



**ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తన కుటుంబంలో తలెత్తిన వివాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు రాజీవ్, కోడలు మేఘన మధ్య ఉన్న విభేదాలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక టీడీపీ ఎమ్మెల్యే ప్రమేయం ఉందంటూ ఆయన విడుదల చేసిన వీడియో ప్రకటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ, "నా కోడలు మేఘన కుటుంబ సభ్యులు మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయానికి వెళ్లారు. కేవలం నా కుటుంబాన్ని మిగతా .. 2లో..




## నాడు తిరుమలను కాపాడుకున్నాం,
# ఇప్పుడు శబరిమల కోసం పోరాడదాం

### విజయవాడలో జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్



**విజయవాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందూ ధర్మం, దేవాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని, శబరిమల పవిత్రతను కాపాడటానికి అయ్యప్ప భక్తులు, హిందూ సమాజం నడుం బిగించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని మిగతా .. 2లో..

# భారతీయ విద్యార్థులు, నిపుణులకు అమెరికా మరో షాక్




**ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో చదువు, ఉపాధి అవకాశాల కోసం చూస్తున్న భారతీయ విద్యార్థులు, నిపుణులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమైంది. హెచ్-1బీ, ఎఫ్-1 ఓపీటీ ప్రోగ్రామ్‌కు కొత్త ఫీజులు విధించేందుకు చర్యలు ప్రారంభించింది. యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఇందుకు సంబంధించిన చర్యలు ప్రారంభించిందని న్యూయార్క్‌కు చెందిన ఇమిగ్రేషన్ సేవల సంస్థ ఫ్రాగోమెన్ పేర్కొంది. కొన్ని రకాల హెచ్-1బీ పిటిషన్లు, ఎఫ్-1 ఆప్షనల్ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### ఫుడ్ ప్రాసెసింగ్‌తో

# పంటలకు విలువ జోడిద్దాం

చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

**ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ**

"ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే ఆవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్ట్సుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్ గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ.35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టు ను ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు చేపట్టాం. రైతులు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నాను. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా- కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. కష్టకాలంలో అన్ని ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్ స్టాపబుల్." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నారాలోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు హాజరయ్యారు.

### ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం

# స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ

కల్పిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

**సుప్రీంకోర్టు ఆదేశాలే కీలకం**

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 2025 సెప్టెంబర్ 1న సివిల్ అప్పీల్ నెం.1385/2025లో ఇచ్చిన తీర్పు, ఆ తర్వాత 2026 మే 29న రివ్యూ పిటిషన్లపై వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం, 2028 ఆగస్టు 31వ తేదీలోగా ఇన్-సర్వీస్ టీచర్లు ఈ అర్హతను తప్పనిసరిగా పొందాలని సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించింది. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఈ గడువును పొడిగించింది. అంతేకాకుండా, ఉపాధ్యాయులకు తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెట్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు చర్యలు చేపట్టింది.

**అర్హులు ఎవరు? ఈ టెట్ ప్రయోజనం ఏమిటి?**

ఈ ప్రత్యేక టెట్ కేవలం 2011కు ముందు నియమితులై, ప్రస్తుతం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ సంక్షేమ సొసైటీల పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ టీచర్లకు (రెగ్యులర్, మినిమమ్ టైమ్ స్కేల్) మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ పరీక్షలో సాధించిన అర్హత భవిష్యత్తులో ఎలాంటి ప్రత్యక్ష నియామకాలకు (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఉపయోగపడదని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలి. ఈ స్పెషల్ టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా కేవలం ప్రస్తుత ఉద్యోగ కొనసాగింపు, తదుపరి ప్రమోషన్లకు మాత్రమే అర్హత లభిస్తుంది. ఈ టెట్ సర్టిఫికెట్ వ్యాలిడిటీ జీవితకాలం ఉంటుంది.

**పరీక్ష విధానం, పేపర్లు**

స్పెషల్ ఏపీటెట్ రెండు పేపర్లుగా ఉంటుంది. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్లు పేపర్-1కు హాజరుకావాలి. ఐ.జుశ్రీ.జుఎతో పాటు దీ.జుఐ అర్హత ఉన్న ఎస్జీటికు కూడా పేపర్-1 రాయవచ్చు. ఇక 6 నుంచి 8వ తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్లు, టీజీటీలు, లాంగ్వేజ్ పండిట్లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేపర్-2కు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్ మాస్టర్లుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు తమ సంబంధిత సబ్జెక్టులో పేపర్-2 రాయాలి. D.El.Ed, B.Ed రెండూ ఉన్న అభ్యర్థులు పేపర్-1, పేపర్-2 రెండింటికీ హాజరుకావాలనుకుంటే, వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

**ముఖ్యమైన తేదీలు, దరఖాస్తు ప్రక్రియ**

నోటిఫికేషన్ విడుదల: 24 ఆగస్టు 2026

ఆన్‌లైన్ దరఖాస్తులు, ఫీజు చెల్లింపు: 25 ఆగస్టు 2026 నుంచి 24 సెప్టెంబర్ 2026 వరకు

ఆన్‌లైన్ మాక్ టెస్ట్: 25 సెప్టెంబర్ 2026 నుంచి అందుబాటులో ఉంటుంది

హాల్ టికెట్ల డౌన్‌లోడ్: 05 అక్టోబర్ 2026 నుంచి

పరీక్షల తేదీలు: 11 అక్టోబర్ 2026 నుంచి 21 అక్టోబర్ 2026 వరకు

ఫలితాల వెల్లడి: 15 నవంబర్ 2026

అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ **cse.ap.gov.in** ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి పేపర్‌కు పరీక్ష ఫీజుగా రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు నింపేటప్పుడు పూర్తి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, ఫీజు చెల్లించి, తుది సమర్పణ చేసిన తర్వాత ఎలాంటి మార్పులకు అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

**పరీక్ష కేంద్రాలు, ఉత్తీర్ణత మార్కులు**

ఈ పరీక్షను రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ఆన్‌లైన్ విధానంలో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ - జదీ) నిర్వహిస్తారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి అవసరమైతే పొరుగు రాష్ట్రాల్లోని సమీప జిల్లాల్లో కూడా కేంద్రాలను కేటాయించే అవకాశం ఉంది. పరీక్షలను ప్రతిరోజూ ఉదయం (9:30 నుంచి 12:00), మధ్యాహ్నం (2:30 నుంచి 5:00) రెండు సెషన్లలో 2 గంటల 30 నిమిషాల పాటు నిర్వహిస్తారు.

ఉత్తీర్ణత సాధించడానికి జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 60%, బీసీ అభ్యర్థులకు 50%, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మాజీ సైనికోద్యోగులకు 40% మార్కులను కనీస అర్హతగా నిర్ణయించారు.

**నార్మలైజేషన్ విధానం, తుది కీ**

పరీక్షలను పలు షిఫ్టుల్లో నిర్వహిస్తున్నందున, మార్కుల కేటాయింపులో సమానత్వాన్ని పాటించడానికి స్టాండర్డ్ నార్మలైజేషన్ ఫార్ములాను ఉపయోగిస్తామని విద్యాశాఖ తెలిపింది. పరీక్షలు ముగిసిన తర్వాత ప్రాథమిక కీని విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. నిపుణుల కమిటీ వాటిని పరిశీలించిన అనంతరం తుది కీని ప్రకటిస్తారు. తుది కీపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. మొత్తం మీద, సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువులోగా ఉపాధ్యాయులు టెట్ అర్హత పొందేందుకు వీలుగా ఈ ప్రత్యేక పరీక్షను నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, స్పెషల్ ఏపీటెట్ చైర్‌పర్సన్ తమీమ్ అన్సరియా తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### తిరుపతిలో డ్రోన్ బ్యాటరీ తగిలి

# హోంమంత్రి అనితకు స్వల్పగాయం

అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ డ్రోన్‌కు సంబంధించిన బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోయింది. దాంతో ఆ డ్రోన్ కిందికి పడిపోగా, దాంట్లోని బ్యాటరీ ఊడి, నేరుగా వేదికపై ఉన్న మంత్రి అనిత కుడిచేతిపై పడింది. ఈ అనూహ్య ఘటనతో అక్కడున్న అధికారులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన ఎస్పీ సుబ్బరాయుడు, మంత్రి అనితకు ప్రథమ చికిత్స అందించి, గాయమైన చేతికి బ్యాండేజ్ వేశారు. అయితే, చేతికి గాయమైనప్పటికీ మంత్రి అనిత బ్యాండేజ్‌తోనే తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. గాయం తీవ్రమైనది కాకపోవడంతో అధికారులు, పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, ప్రమాదానికి కారణమైన డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందా, లేక నిర్వాహకుల నిర్లక్ష్యం కారణమా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన నేపథ్యంలో వీఐపీల భద్రత, కార్యక్రమాల్లో డ్రోన్ల వినియోగంపై ఉన్న నిబంధనలను సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

### మాజీ మంత్రి కారుమూరికి

# 14 రోజుల రిమాండ్

హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కారుమూరికి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం, పోలీసులు కారుమూరి నాగేశ్వరరావును చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. గత ఏపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం వ్యాపార కార్యకలాపాల్లో జరిగిన అవకతవకలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కేసులో కారుమూరి నాగేశ్వరరావును నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన రిమాండ్‌తో ఈ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది.

### హైదరాబాద్ నుంచి ఏపీకి అక్రమంగా

# చికెన్ వ్యర్థాల తరలింపు

వ్యర్థాలను కొందరు అక్రమార్కులు సేకరించి, లారీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని చేపల చెరువులకు తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు, పశువైద్య అధికారులు వాహనాలను తనిఖీ చేసి ఈ 100 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి అపరిశుభ్రమైన, ప్రమాదకరమైన చికెన్ వ్యర్థాలను మేతగా వేసి పెంచిన చేపలను వినియోగించడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ తరహా కలుషిత చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల పలు రకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ అక్రమ రవాణాదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# కాకినాడ బీచ్‌లో యువకుల గల్లంతు

ఆచూకీ కోసం గాలింపు చర్యలను తక్షణమే ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలతో పాటు మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డ్, స్థానిక మత్స్యకారుల సహాయాన్ని కూడా తీసుకోవాలని సూచించారు.

**అసలేం జరిగిందంటే..**

కాకినాడ గ్రామీణ మండలం సూర్యారావుపేట పరిధిలోని ఎన్టీఆర్ బీచ్ వద్ద ఆదివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. చీడిగ గ్రామానికి చెందిన కవల సోదరులు అనసూరి వీరబాబు, శ్రీగణేశ్ సాయిరామ్.. తమ స్నేహితులైన పడాల యువకిశోర్ (ఇంద్రపాలెం), కాదా ఆదిత్య వెంకట సందీప్ కుమార్‌తో కలిసి సముద్ర స్నానానికి వెళ్లారు. వీరంతా స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన పెద్ద కెరటం వీరబాబు, యువకిశోర్‌ను సముద్రంలోకి లాక్కెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన బీటెక్ విద్యార్థి శ్రీగణేశ్ సాయిరామ్, మరో ఇంటర్ విద్యార్థి సందీప్ కుమార్ సురక్షితంగా బయటపడ్డారు. వారిని స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారిలో ఒకరు కవల సోదరుడు కావడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం పోలీసులు, సహాయక బృందాలు సముద్రంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బాధితుల కుటుంబాలకు అందుబాటులో ఉండి, వారికి ధైర్యం చెప్పాలని, సహాయక చర్యల వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

# ట్రంప్ తనయుడికి ఇరాన్ టీవీలో బెదిరింపులు

బెదిరిస్తూ.. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా ఛానల్ ఓ వీడియోను ప్రసారం చేసింది. అతడి తలపై 10 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించింది. ఈ వీడియోలో బారెన్ ఏ సమయంలో ఎక్కడ ఉంటారు? అతడిని లక్ష్యం చేసుకొనేందుకు సరైన చోటు ఏది? అనే విషయాలను గ్రాఫిక్స్‌లో చూపించింది. ఇందులో బారెన్‌తో ఉండే కుటుంబ సభ్యులు, స్నేహితుల దృశ్యాలు.. సీక్రెట్ సర్వీస్ అధికారులను తప్పించుకొని అతడి నివాసంలోకి ప్రవేశించే మార్గాలను సైతం చూపించడం గమనార్హం. అమెరికాలోని ఉన్నతాధికారులను, కీలక నేతలను హతమార్చడానికి ఇరాన్ కుట్ర పన్నుతోందని ఇటీవల అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ అంత్యక్రియల సమయంలో.. ట్రంప్‌ను చంపుతామని ఆయన మద్దతుదారులు బెదిరించడాన్ని వారు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ మీడియా నుంచి ఈ తరహా ప్రకటన వెలువడడం గమనార్హం. కాగా, జులైలో 'ట్రంప్ సతీమణి మెలానియాను ఎలా హత్య చేయాలి?' అనే వీడియోను ఇరాన్‌కు చెందిన 'తస్నిమ్' అనే మీడియా సంస్థ ప్రసారం చేయగా.. అమెరికా సీక్రెట్ సర్వీస్ అధికారులు విచారణ చేపట్టారు.

# నిబంధనలు పాటించాల్సిందే

విమర్శలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీపీసీసీ క్రమశిక్షణా సంఘం, వివరణ కోరుతూ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, ఆ అంశానికి తనను బాధ్యురాలిని చేయవద్దని వివరణలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎవరూ అతీతులు కారని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# కొత్త పార్టీని ప్రకటిస్తా

అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

# రాజకీయం చేస్తున్నారు

రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ వివాదంలోకి రాజకీయాలను లాగుతున్నారు" అని ఆరోపించారు. ఇది తనను, తన కుటుంబ సభ్యులను మానసిక ఇబ్బందులకు గురిచేసేందుకు జరుగుతున్న కుట్ర అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జోగి రమేశ్ చేసిన ఆరోపణలపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్పందించారు. ప్రజాప్రతినిధిగా తన కార్యాలయానికి ఎవరైనా రావొచ్చని, ఆ క్రమంలోనే మేఘన కుటుంబ సభ్యులు కూడా తనను కలిశారని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో మరుసటి రోజు స్పష్టత ఇస్తానని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలతో జోగి రమేశ్ వ్యక్తిగత కుటుంబ వివాదం కాస్తా వైసీపీ, టీడీపీ నేతల మధ్య పరస్పర రాజకీయ ఆరోపణలకు దారితీసింది.

# ఇప్పుడు శబరిమల కోసం పోరాడదాం

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ నాస్తికులు, కొందరు అన్యమతస్థులు హిందూ ధర్మంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తిరుమలలో ఏడుకొండలను రెండు కొండలుగా మార్చేందుకు, ఆచారాలను మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. అప్పుడు హిందూ సమాజం పోరాడి తిరుమల పవిత్రతను కాపాడుకుందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు శబరిమల రక్షణకు కూడా పోరాడాలన్నారు. "స్వామియే శరణమయ్యప్ప అంటూనే, ధర్మాన్ని నాశనం చేసే శక్తుల పీచమణిచేందుకు కూడా సిద్ధం కావాలి" అని ఆయన ఉద్బోధించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేరళలోని ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. గతంలో టీటీడీ నిధులపై జరిగిన చర్చను ప్రస్తావిస్తూ, "వెంకటేశ్వర స్వామి వడ్డీ కాసుల వాడే కానీ, వడ్డీ వ్యాపారి కాదు" అని తాను అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. టీటీడీ చట్టం ప్రకారం ఇతర దేవాలయాల్లో అన్నప్రసాదం అందించేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేలా మాధవ్‌తో చర్చిస్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో భక్తులు లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం అయ్యప్ప భక్తుల సమస్య కాదని, యావత్ హిందువుల సమస్యగా భావించి పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# భారతీయ విద్యార్థులు, నిపుణులకు అమెరికా మరో షాక్

ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లపై కొత్త రుసుములను విధించే నిబంధనల ప్రక్రియను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రారంభించినట్లు ఫ్రాగోమెన్ తెలిపింది. ఓపీటీ దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు తీసుకొచ్చే యోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా రుసుమును 1,03,265 డాలర్లకు పెంచే ప్రతిపాదనను హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం తాజాగా విడుదల చేసిందని ఫెడరల్ రిజిస్టర్ వెల్లడించింది. వాస్తవానికి గత ఏడాదే ఫీజును విధించినప్పటికీ.. న్యాయస్థానాలు దానిని నిలిపివేశాయి. అంతర్జాతీయ విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత అమెరికాలో పని అనుభవం పొందేందుకు ఓపీటీ కీలకం. దీనిపై 1 లక్ష డాలర్లు.. అంటే మన కరెన్సీ ప్రకారం సుమారు రూ.95 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఆగస్టు 20న ఈ ప్రతిపాదనను ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ సమీక్షకు డీహెచ్ఎస్ పంపగా.. దీనిపై ప్రస్తుతం సమీక్ష జరుగుతోంది.

**భారతీయ విద్యార్థులపై ప్రభావం**

గతేడాది సుమారు 3 లక్షల మంది ఎఫ్-1 విద్యార్థులు ఓపీటీ ద్వారా ఉపాధి అనుమతి పొందారు. ఈ ప్రోగ్రాములో ఏటా చేరే భారతీయుల సంఖ్యా ఎక్కువే. భారతీయ విద్యార్థులకు ఉన్నత చదువులు, ఆపై అమెరికాలో ఉపాధి అవకాశాలు, ఆ తర్వాత హెచ్-1బీ వ్యవస్థలోకి మారడానికి ఓపీటీ మొదటి మెట్టుగా వ్యవహరిస్తారు. ఒకవేళ పెద్ద మొత్తంలో ఫీజు విధిస్తే ఆ మేర విద్యార్థులపై ప్రభావం పడుతుందనేది నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనలపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన అనంతరం కొత్త ఫీజు అమలు తేదీ, తుది నిబంధనలు జారీ చేస్తుంది.

### రామోజీపై విమర్శలా?

# ముందు పోలవరం సంగతి చెప్పు!

**అంబటికి మంత్రి నిమ్మల కౌంటర్**

**అమరావతి, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నేత అంబటి రాంబాబుపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, లక్షలాది మందికి ఉపాధి కల్పించిన రామోజీరావు ని విమర్శించడం ఆకాశంపై ఉమ్మివేయడమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. నైతికత గురించి మాట్లాడే అర్హతే లేని అంబటి రాంబాబు, రామోజీరావు వంటి మహనీయుడిపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. ఈనాడు, రామోజీ ఫిల్మ్ సిటీ, ఉషాకిరణ్ మూవీస్ వంటి సంస్థల ద్వారా తెలుగు వారి ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పిన రామోజీరావు సేవలను మంత్రి నిమ్మల గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుంచి జగన్ పాలన వరకు, ప్రజా సమస్యలపై గళమెత్తినందుకే రామోజీరావుపై, ఆయన సంస్థలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టి వేధించినా ఆయన న్యాయపోరాటం చేసి నిలిచారని అన్నారు. మార్గదర్శి వ్యవహారంలో ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, న్యాయస్థానం ఇచ్చిన స్పష్టతను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించవద్దని హితవు పలికారు. 2006లో మార్గదర్శిపై వివాదాలు సృష్టించినప్పుడు డిపాజిట్‌దారుల ప్రయోజనాలే పరమావధిగా భావించి, తన సొంత ఆస్తులను సైతం పణంగా పెట్టి చెల్లింపులు జరిపిన ఆయన విశ్వసనీయతను గుర్తుంచుకోవాలని అన్నారు. చిరునామాలు సరిగా లేని కారణంగా చెల్లించలేని డిపాజిట్లను కూడా ఎస్క్రో ఖాతాల్లో భద్రపరిచారని తెలిపారు. ఇంతటి నిజాయతీపరుడిని విమర్శించే ముందు, గత ప్రభుత్వంలో తన శాఖ పనితీరుపై అంబటి ఆత్మపరిశీలన చేసుకోవాలని నిమ్మల హితవు పలికారు. "జలవనరుల శాఖ మాజీ మంత్రిగా, పోలవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారో అంబటి రాంబాబు ప్రజలకు సమాధానం చెప్పాలి. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజాపక్షం వహించిన ఒక గొప్ప వ్యక్తిపై బురద చల్లడం ఎంతవరకు సమంజసం?" అని నిమ్మల ప్రశ్నించారు. రామోజీరావు గారి స్థాయికి, వైసీపీ నేతల స్థాయికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, ఎవరు ప్రజల కోసం నిలబడ్డారో, ఎవరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని విఫలమయ్యారో ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అంబటి వంటి వారి విమర్శలు రామోజీరావుపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఏమాత్రం తగ్గించలేవని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## జగన్ మీద తొలిసారి గన్ ఎక్కుపెట్టిన విజయ్ సాయి


విజయసాయిరెడ్డి అంటే వైసీపీలో నెంబర్ టూ అనే అంటారు. ఆయన ఆ పార్టీని వీడి 20 నెలలు అవుతున్నా కూడా ఆయనను వైసీపీ నాయకుడుగా చూస్తారు. అంతే కాదు జగన్ నీడగా సైతం భావిస్తారు. అయితే విజయసాయిరెడ్డి వైసీపీ మాజీ లీడర్ అనిపించుకోవడానికి ఈ మధ్య కాలంలో చాలానే చేశారు. ఎన్నో సార్లు విమర్శలు వైసీపీ మీద చేశారు, జగన్ కోటరీ మీద చేశారు, కానీ తొలిసారి జగన్ మీద నేరుగానే హాట్ కామెంట్స్ చేశారు. అవి కూడా తూటాలా పేలేలాంటి కామెంట్స్ చేశారు. జగన్ రాజకీయం మీద గట్టి దెబ్బ తీసేలా ఈ కామెంట్స్ ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ జగన్ రాజకీయ ప్రత్యర్థులు ఎవరూ చేయని విధంగా విజయసాయిరెడ్డి చేసిన కామెంట్స్ జనంలోకి ఏ విధంగా వెళ్తాయో తెలియదు కానీ జగన్ ని ఇక మీదట స్ట్రాంగ్ గానే ఎదుర్కోవడానికి విజయసాయిరెడ్డి సిద్ధపడ్డారని అంటున్నారు. దానికి ఆరంభంగా ఆయన జగన్ క్రిస్టియన్ మత ఆరాధకుడు కాబట్టి ఆయనను హిందూ ద్వేషిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు అని అంటున్నారు.

**మత మార్పిడులను ప్రోత్సహించారు :** జగన్ మత మార్పిడులను ప్రోత్సహించారు అన్నది మామూలు విమర్శ కాదు, వైసీపీ కూసాలను కదిలించే విమర్శ. ఏపీలో అత్యధిక సంఖ్యలో హిందువులు ఉన్నారు, వారి మీద ప్రభావం చూపించేలా విజయసాయిరెడ్డి వ్యూహాత్మకంగానే ఈ విమర్శలు చేశారా అన్న చర్చ వస్తోంది. అంతే కాదు జగన్ హయాంలో వందల చర్చుల నిర్మాణానికి సహకరించారని లెక్కలతో సహా వివరించారు. అదే సమయంలో జగన్ ఏరోజూ హిందూ మతాన్ని ప్రోత్సహించలేదని అంటూ ఆయనని ఒక బలమైన వర్గానికి దూరం చేసే ప్రయత్నం చేసినట్లుగా విజయసాయిరెడ్డి కామెంట్స్ ఉన్నాయని అంటున్నారు.

**ఎదురు నిలిచి మరీ :** జగన్ నీడ లాంటి విజయసాయిరెడ్డి ఇపుడు ఎదురు నిలిచారు. ఆయన బీజేపీలో చేరి ఉంటే బీజేపీ నేతగా ఆ పార్టీ ఫిలాసఫీని ఈ విధంగా మాట్లాడితే దానికి అంత విలువ ఉండకపోవచ్చు. లేదా జగన్ ప్రత్యర్థి పార్టీలలో చేరినా కూడా ఆయన విమర్శలు రొటీన్ గా తీసుకునే అవకాశం ఉంది. కానీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీని స్థాపించాలని అనుకుంటున్నారు. దాంతో ఆయన విమర్శలకు పదును ఎక్కువ ఉంటుందని అంటున్నారు. పైగా ఆయన జగన్ తోనే సుదీర్ఘ కాలం ఉంటూ వచ్చారు. వైసీపీ పునాదుల నుంచి ఉన్న నాయకుడిగా విజయసాయిరెడ్డి మాటలను ఎంతో కొంత విశ్వసించే అవకాశాలు కూడా ఉంటాయని అంటున్నారు.

**కట్టడి చేసే వ్యూహంతో :** వైసీపీని కట్టడి చేసే వ్యూహంతోనే విజయసాయిరెడ్డి ఈ విధంగా మతాన్ని ఎంచుకుని మరీ జగన్ మీద తీవ్రమైన వ్యాఖ్యలు చేశారా అని చర్చ సాగుతోంది. ఒక వర్గాన్ని వైసీపీకి దూరం చేయాలన్న ఆలోచన కూడా అందులో ఉందా అని రాజకీయ విశ్లేషకులు తర్కిస్తున్నారు. విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలను వైసీపీ ఖండిస్తుందో లేదా మౌనంగా చూస్తూ ఉంటుందో తెలియదు కానీ ఆయన ఇది ఆరంభం అంటూనే జగన్ మీద గట్టిగానే టార్గెట్ చేశారు. ఇపుడు విజయసాయిరెడ్డి మీద వైసీపీ విమర్శిస్తే ఆయన ఆరోపణలకు విలువ ఇచ్చినట్లు అవుతుంది. అపుడు ఆయన మరింతగా దూకుడు చేసే అవకాశాలు ఉంటాయి.

**జగన్ మీద ధర్మాగ్రహమా :** అలా కాకుండా చూసీ చూడనట్లుగా వదిలేస్తే ఆయన వ్యాఖ్యలు ఏ మేరకు వైసీపీని డ్యామేజ్ చేస్తున్నాయో కూడా అర్థం కాని పరిస్థితి. మొత్తానికి నంబర్ టూ గా నిన్నటి దాకా ఉన్న విజయసాయిరెడ్డిది వైసీపీ మీద జగన్ మీద ధర్మాగ్రహమా లేక ధర్మ పోరాటమా లేక తన రాజకీయ ఆరాటమా తెలియదు కానీ ఆయన కొత్త పార్టీ గురి మాత్రం కచ్చితంగా వైసీపీ మీదనే ఉండబోతోంది అన్నది ఆయన తాజా ఘాటు వ్యాఖ్యలతో స్పష్టం అయింది అని అంటున్నారు.జస్ట్ టీజర్ ని మాత్రమే విజయసాయిరెడ్డి వదిలారు, ముందు ముందు సినిమా చూపిస్తే ఎలా ఉంటుందో వైసీపీకి ఆ వేడి ఏ విధంగా కాక పుట్టిస్తుందో చూడాలి మరి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్



# క్రైమ్ వాయిస్

## కేపీహెచ్‌బీలో విషాదం.. ఐదో అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై పది నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## ఆమె వల్ల పరువు పోతోంది.. చంపేయ్..

### కుమార్తెను ప్రియుడితో చంపించిన తండ్రి

**ఎల్కతుర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో మహిళ మృతి కేసును పోలీసులు ఛేదించారు. 3 రోజుల క్రితం కారు డిక్కీలో మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతురాలిని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. మానస తండ్రే హత్య చేయించినట్లు దర్యాప్తులో తేల్చారు. ఎల్కతుర్తికి చెందిన ప్రియుడు వినోద్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి ప్రశ్నించగా.. మానస తండ్రి రాజేశం ఆదేశం మేరకే చంపినట్లు వెల్లడించాడు. కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మానసకు ఇది వరకే రెండు వివాహాలు జరిగి విడాకులు అయ్యాయి. అనంతరం పుట్టింట్లో ఉంటోంది. ఆ తర్వాత కరీంనగర్‌కు చెందిన వినోద్‌కుమార్‌తో సన్నిహితంగా ఉంటోంది. గతవారం అరుణాచలం వెళ్తున్నట్లు చెప్పి వినోద్ గదికి వెళ్లింది. పెళ్లి చేసుకోవాలని అతడిపై ఒత్తిడి తెచ్చింది. దీంతో వినోద్.. మానస తండ్రి రాజేశంకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. తమ మాట వినకుండా ఆమె ఇష్టారీతిన తిరుగుతోందని, కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. మానస వల్ల పరువు పోతోందని.. చంపేయమని వినోద్‌కు చెప్పాడు. ఏదైనా చేసి ఆమె వల్ల ఇబ్బంది లేకుండా చూడాలని కోరాడు. పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండటం, తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతుండటంతో మానస, వినోద్ మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో వినోద్.. మానస గొంతు నులిమి చంపేశాడు. అనంతరం కారు డిక్కీలో మృతదేహాన్ని పెట్టి ఎల్కతుర్తిలోని తన ఇంటి పరిసరాల్లోకి తీసుకెళ్లాడు. మృతదేహాన్ని పాతిపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తుండగా దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎల్కతుర్తి శివారులో వినోద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

### తిరుపతి డీఎస్పీ పేరిట

## రూ.కోట్లలో మోసం.. కేటుగాడి అరెస్ట్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జిల్లా డీఎస్పీనంటూ నకిలీ అవ తారమెత్తి, బోగస్ కంపెనీల్లో పెట్టుబడుల పేరిట అధిక లాభాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకులను నిలువునా ముంచిన ఓ ముఠా సభ్యుడిని హైదరాబాద్ సీసీఎస్ (డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్) ఈఓడబ్ల్యూ బృందం అరెస్టు చేసింది. నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా, రాయచోటికి చెందిన కొండూరు రెడ్డి వెంకట్ రాజు అలియాస్ కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజు (40)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు కేవీపీ రాజు, కొంతమంది ముఠా సభ్యులతో కలిసి తాము సీనియర్ పోలీస్ అధికారులమని ప్రచారం చేసుకుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అనేక మంది అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారు. ఉనికిలో లేని నకిలీ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే స్వల్పకాలంలోనే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. బాధితులకు నమ్మకం కలిగించేందుకు సెక్యూరిటీ పేరిట నకిలీ ఆస్తి పత్రాలు, పోస్ట్ డేటెడ్ చెక్కులను ఇచ్చేవారు. అయితే సమయానికి డబ్బు తిరిగి ఇవ్వకపోగా, బాధితులు నిలదీస్తే తాము 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులమంటూ' బెదిరింపులకు దిగేవారు. ఈ క్రమంలోనే ఒక ఫిర్యాదుదారుడి నుంచి రూ.1.20 కోట్లు వసూలు చేసి మోసం చేశారు. దీంతో బాధితుడు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలో, ఏసీపీ కె. కిరణ్ పర్యవేక్షణలో ఎస్సై జి. అనిల్ కుమార్, సిబ్బంది నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. అధిక లాభాలు ఇప్పిస్తామంటూ చేసే నకిలీ హామీలు, ప్రచారాలను నమ్మి అమాయక ప్రజలు ఎవరూ తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి మోసపోవద్దని హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## లిఫ్ట్ నుంచి పడిపోయి బాలిక మృతి



**సత్తెనపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లిన ఓ బాలిక లిఫ్టు నుంచి పడిపోయి మృతిచెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో పనిచేసే భవరిశెట్టి మహేష్, మణిదీపిక కుటుంబం వడ్డవల్లి పోలేరమ్మ ఆలయ సమీపంలో నివాసముంటోంది. వీరి ఏకైక కుమార్తె, ఏడో తరగతి చదువుతున్న రేవతి(12) ఆదివారం తమ ఇంటి సమీపంలోని ఇద్దరు చిన్నారులతో ఆడుకునేందుకు వారి ఇంటికి వెళ్లింది. ఆ ఇద్దరు చిన్నారుల తాతయ్య, వ్యాపారి కోటేశ్వరరావు కుటుంబం తమ మూడంతస్తుల ఇంటికి ఇటీవలే లిఫ్ట్ ఏర్పాటు చేసుకుంది. సాయంత్రం లిఫ్టులో నుంచి శబ్దం రావడంతో అందరూ వచ్చి చూడగా, రేవతి తలకు తీవ్ర గాయమై గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయి ఉంది. బాలికను వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. తమ బిడ్డ మరణంపై అనుమానాలున్నాయంటూ బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. డోర్లు తెరుచుకోకుండానే లిఫ్ట్ నాలుగైదు అడుగులు పైకి వెళ్లి ఉండటం, లిఫ్ట్‌కు ఒక వైపున్న ప్లాస్టిక్ షీట్లు పగిలి ఉండటం, అక్కడి నుంచే బాలిక బయటపడటం.. అంతా అనుమానంగా ఉందని వాపోయారు. డీఎస్పీ కృష్ణచైతన్య ఘటనాస్థలిని పరిశీలించారు. బాలిక మృతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.






**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలన హత్య కేసులో నిందితుడు షేక్ సాధిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాలతో, కాకినాడ ఇంచార్జి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సూయిసైడ్ నోట్లలో సాధిక్ ఖాన్ వేధింపులే తన చావుకు కారణమని, తన భర్త జగదీష్ రెడ్డికి సాధిక్ ఖాన్ కెమికల్ పాయిజన్ ఇచ్చి చంపినట్లు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వివరాల ఆధారంగా జగదీష్ రెడ్డి తండ్రి కొవ్వూరి భాస్కర్ రెడ్డి సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఆగస్టు 17న సర్పవరం పోలీస్ స్టేషన్‌లో జతీఅఎవ చీశీ.260/2026 కింద దీచీూ సెక్షన్లు 103(1), 308(5), 127(7), 351(3), 108, 299కు అనుగుణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**మీరట్‌లో అరెస్ట్**

విశ్వసనీయ సమాచారం ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చేరుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో ఆగస్టు 22 ఉదయం సుమారు 9 గంటలకు నౌచండి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో షేక్ సాధిక్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం మీరట్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ పొందిన పోలీసులు నిందితుడిని కాకినాడకు తరలించారు. కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నారు.

**పలు కోణాల్లో దర్యాప్తు**

మృతుల మరణ వాంగ్మూలాల్లో పేర్కొన్న అంశాలు, నిందితుడి పాత్ర, జగదీష్ రెడ్డి మరణానికి దారితీసిన పరిస్థితులు, అనుమానాస్పద అంశాలు, మతమార్పిడికి సంబంధించిన ఆరోపణలు, మృతులపై జరిగిన బెదిరింపులు తదితర అంశాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా రికార్డులు, వైద్య రికార్డులు, బ్యాంకు

**ఆరు బృందాలతో వేట.. మీరట్‌లో పట్టివేత**

నిందితుడి అరెస్టులో జగ్గంపేట సీఐ బి. తిరుపతి రావు, తుని టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. గీతారామకృష్ణ, పోర్ట్ ఇన్‌స్పెక్టర్ పి. సునీల్ కుమార్, క్రైమ్ సీఐ పి.వి. త్రినాథ్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి, ఇంద్రపాలెం ఎస్సై ఎం. వీరబాబు, సర్పవరం ఎస్సై ఎం. యేసుబాబు, ఉప్పాడ కొత్తపల్లి ఎస్సై జి. వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై టి. తులసీరామ్, తుని టౌన్ ఎస్సై జె. విజయబాబు తదితరులు, వారి సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. బృందాలను పర్యవేక్షించిన డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణతో పాటు దర్యాప్తు బృంద సభ్యులను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ రివార్డులతో అభినందించారు. కేసులోని అన్ని కోణాలపై దర్యాప్తు కొనసాగుతున్నందున, తదుపరి దర్యాప్తులో వెలుగులోకి వచ్చే ఆధారాల ఆధారంగా మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ప్రవాహ శక్తితోనే సాగునీరు

- కాకినాడ రైతు శ్రీనివాస్ సృష్టించిన 'హైడ్రో లిఫ్ట్' ఆవిష్కరణకు జాతీయ స్థాయి గుర్తింపు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రశంస



**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కరెంట్, డీజిల్ లేదా పెట్రోల్ వంటి ఎటువంటి ఇంధన అవసరం లేకుండా, కేవలం నీటి ప్రవాహ శక్తి (యాంత్రిక శక్తి) ఆధారంగా దిగువ ప్రాంతాల నుంచి ఎగువకు నీటిని ఎత్తిపోసే వినూత్న "హైడ్రో లిఫ్ట్" యంత్రాన్ని కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, కైకవోలు గ్రామానికి చెందిన రైతు పంపన శ్రీనివాస్ చేశారని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేశీధిర ప్రసాద్ ప్రశంసించారు. ఈ మేరకు సోమవారం స్థానిక పిజిఆర్ఎస్ హాలు నందు జాతీయ గుర్తింపు అవార్డు పత్రాన్ని శ్రీనివాస్ కు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వాగులు లేదా చెక్ డ్యామ్‌ల వద్ద నీటి ఉధృతికి ఇనుప టర్బైన్లు తిరుగుతాయని. గేర్ బాక్సుల సహాయంతో ఈ యాంత్రిక శక్తి ద్వారా పంపులు పనిచేసి, నీటిని ఎగువ ప్రాంతాలకు పంప్ చేస్తాయన్నారు .ఈ హైడ్రో లిఫ్ట్ 24/7 ప్రాతిపదికన పనిచేస్తూ,ఈ యంత్రం రోజు కు దాదాపు 25 లక్షల లీటర్ల నీటిని ఎత్తిపోసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు ..ఈ సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల గిరిజన,ఏజెన్సీ మరియుఎగువప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు విద్యుత్ బిల్లులు,డీజిల్ ఇంధన భారం ఉండదన్నారు ఐటీఐ ఫిట్టర్ కోర్సుపూర్తి చేసిన పంపన శ్రీనివాస్, కొండ ప్రాంతాల్లో సాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్న రైతుల కష్టాలను ప్రత్యక్షంగా చూసి దాదాపు 10 ఏళ్ల పాటు శ్రమించి ఈ ప్రాజెక్ట్ నమూనాను సిద్ధం చేశారు. ఖ గా విశ్వ విద్యాలయం అటల్ ఇన్నోవేషన్ మిషన్ అందించిన రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో వేట్ల పాలెం చెక్ డ్యామ్ వద్ద ఈ ప్రయోగాన్ని విజయ వంతంగా నిర్వహించారు. జాతీయ అవార్డు గ్రహీత పంపన శ్రీనివాస్ భవిష్యత్ ప్రణాళికలు గురించి వివరిస్తూ...ప్రస్తుతం 30 అడుగుల ఎత్తు వరకు నీటిని ఎత్తిపోసే ఈ యంత్రాన్ని, భవిష్యత్తులో 100 అడుగుల ఎత్తు వరకు పనిచేసేలా మరియు దీని ద్వారా 10 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసేలానవీకరిస్తున్నానన్నారు.. పేటెంట్ (గ్ఫ్వత్) ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ సాంకేతికత ను రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో స్థానిక గవర్నమెంట్ ఐటిఐ ప్రిన్సిపాల్ ఎంవిజి వర్మ ట్రైనింగ్ అధికారి పివి ఆర్వి శర్మ, కైకవోలు వాస్తవ్యులు దాట్ల చరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.


## పాస్‌పోర్ట్ పోయినది

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం ఎన్‌ఎంఆర్ కాలనీ మహేంద్రవాడ గ్రామం, డో.నెం.5-204 నివాసం ఉంటున్నాము. ది.14-08-2026వ తేదీన మహేంద్రవాడ గ్రామం నుండి అనపర్తి రైల్వేస్టేషన్‌కు వెళ్ళు మార్గ మధ్యంలో పాస్‌పోర్ట్ నెం.S3917706 పడిపోయినది. దొరికిన వారు దయచేసి ఈ క్రింది అడ్రస్సుకు పంప కోరుచున్నాము.

**దుబాసి సత్యవెంకట రామ్‌కుమార్**, తండ్రి ప్రతాప్, డో.నెం.5-204, ఎన్‌ఎంఆర్ కాలనీ, మహేంద్రవాడ గ్రామం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జాల్ల సెల్: 7036459994


ముున్సిపల్, పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను

# వేగవంతం చేయాలి : కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :**మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయడంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన విచారణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికా రులను ఆదేశించారు. సోమవారం కలెక్ట రేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం మున్సిపల్, పంచాయతీ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఈఆర్ఓలు, ఇతర క్షేత్రస్థాయి అధికారులతో ఎన్నికల అం శాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా ఏఈఆర్ఓలు, తహశీల్దార్లు తమ పరిధిలోని అన్ని విచారణలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట వర్చువల్ విచారణలను వినియోగించుకోవాలని, సాంకేతిక లేదా లాగిన్ సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.రాష్ట్రస్థాయి సమీక్ష నాటికి విచారణలు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల మార్కింగ్‌తో కూడిన ముసాయిదా ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తహశీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణలు నిర్వహించాలని, అవసరమైన అంశాలను గ్రామసభల ద్వారా పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్



ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వం పాటించాలని తెలిపారు.

**పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. ఆగస్టు 21 నాటికి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా తయారీ పూర్తి చేసి, ఆగస్టు 23న ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు తెలిపారు.ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై ప్రజల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలను ఆగస్టు 26లోపు స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చేత ఆమోదం ఆగస్టు 29న పూర్తిచేసి, ఆగస్టు 31న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది తదితర అంశాలను ముందుగానే పరిశీలించి ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో అనుభవజ్ఞులైన, సమర్థులైన అధికారులను గుర్తించి ఎన్నికల విధులకు నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నిర్ణీత గడువులో అవసరమైన వివరాలతో అనుసరణ నివేదిక సమర్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఆర్డీఓలు ఆర్. శివరాముడు, కె. ఆనందరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి. భాగ్యవతి, కె. కనకరాజు, టి. రాజేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వి. శాంతామణి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఈఆర్ఓలు తదితరులు ప్రత్యక్షంగా, జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.




విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

మంగళవారం, 25 ఆగస్టు 2026
www.viswamvoice.com






సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం

# గాలింపు ముమ్మరం చేయాలి

## మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక అధికారులతో సమన్వయం చేయాలి : ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన నేపథ్యంలో వారి ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు, సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు ఆగస్టు 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఎంఓ 135 చేపల బోటులో సముద్రంలోకి వెళ్లారని తెలిపారు. వారు ఆగస్టు 15 లేదా 16 తేదీల్లో తిరిగి రావాల్సి ఉండగా అప్పటి నుంచి వారి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, భారత తీర రక్షక దళం, భారత నావికాదళం, సముద్ర పోలీసులతో పాటు ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో గాలింపు చర్యలు చేపడుతున్నాయని ఎంపీ వివరించారు. ఆగస్టు 17 నుంచి తీర రక్షక దళం, నావికాదళ నౌకలను ప్రతిరోజూ గాలింపు చర్యలకు మోహరించడంతో పాటు రెండు డోర్నియర్ విమానాలను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి తీర రక్షక దళానికి చెందిన వనరులను సమీకరించి బంగాళాఖాతంలో విస్తృతంగా గాలింపు నిర్వహిస్తున్నారని చెప్పారు. గాలింపు పరిధిని ప్రత్యేక ఆర్థిక మండలి వరకు విస్తరించడంతో పాటు సముద్రంలో ప్రయాణించే వాణిజ్య నౌకలు గల్లంతైన బోటును గమనించినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని నావిగేషనల్ టెలెక్స్ సందేశాల ద్వారా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. గల్లంతైన బోటులో స్వయంచాలక గుర్తింపు వ్యవస్థ, అత్యవసర సమాచార ప్రసార పరికరాలు, ఉపగ్రహ ఫోన్ వంటి కమ్యూనికేషన్, గమనింపు పరికరాలు లేకపోవడం వల్ల బోటు కచ్చితమైన స్థానాన్ని గుర్తించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. భారత జాతీయ సముద్ర సమాచార సేవల సంస్థకు చెందిన ఉపగ్రహ ఆధారిత శోధన వ్యవస్థ ద్వారా గుర్తిస్తున్న అత్యంత సంభావ్య గాలింపు ప్రాంతాన్ని ప్రతిరోజూ నవీకరించి సముద్రంలో ఉన్న గాలింపు బృందాలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సముద్ర ప్రవాహాల ఆధారంగా బోటు తూర్పు లేదా ఈశాన్య దిశగా కొట్టుకుపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారని చెప్పారు. బోటు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లి ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని బంగ్లాదేశ్‌లోని ఢాకా సముద్ర రక్షణ సమన్వయ కేంద్రం, మయన్మార్ అధికారులకు కూడా సమాచారం అందించినట్లు తెలిపారు. మత్స్యకారులు సుమారు 17 రోజులకు సరిపడా ఆహార సామగ్రిని వెంట తీసుకెళ్లినప్పటికీ ఆ వ్యవధి ఇప్పటికే గణనీయంగా దాటిపోయిందని, దీంతో సమయం అత్యంత కీలకంగా మారిందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు. గాలింపు చర్యలను మరింత విస్తృత స్థాయిలో కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. గాలింపు చర్యల కోసం అదనపు నౌకలు, వైమానిక వనరులు, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక నిఘా సామర్థ్యాలను అత్యవసరంగా వినియోగించాలని రక్షణ శాఖ మంత్రిని కోరారు. బంగాళాఖాతం అంతటా గాలింపు పరిధిని మరింత విస్తరించి, తూర్పు తీరంలో ప్రయాణించే మత్స్యకార, వాణిజ్య, ఇతర నౌకలను నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. గల్లంతైన బోటు, మత్స్యకారుల ఆచూకీకి సంబంధించిన చిన్న సమాచారం లభించినా వెంటనే సంబంధిత అధికారులకు చేరేలా సమన్వయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు చెందిన సముద్ర భద్రత, శోధన, రక్షణ సంస్థలతో అవసరమైన అంతర్జాతీయ సమన్వయాన్ని మరింత పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గంటా ఎంతో విలువైనదని, ఏడుగురు మత్స్యకారుల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు. వారి సురక్షిత ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేసి గాలింపు చర్యలను సాధ్యమైనంత విస్తృత స్థాయిలో కొనసాగించాలని కోరారు. మత్స్యకారులను సురక్షితంగా గుర్తించే వరకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తూ చర్యలు కొనసాగించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఎంపీ కోరారు.

# బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే ప్రాధాన్యత



**జిల్లా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే**

**అమలాపురం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే బాధితుల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో అడిషనల్ ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 36 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అడిషనల్ ఎస్పీ అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కుష్టు రోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

## హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా సెక్రెటరీ దొరబాబు



**కే.గంగవరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో గత 48 రోజులుగా కుష్టు రోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగుచున్న దీక్షలో భాగంగా వారికి జరుగుతున్న అన్యాయంపై పత్రికలో వచ్చిన సమాచారం, వారి డిమాండ్స్‌ను ఈరోజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లో జరుగుచున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సెక్రటరీ ఎం దొరబాబు మాట్లాడుతూ గత 48 రోజుల నుంచి వీరు దీక్ష చేస్తున్నారని వీరిని ఎవరు పట్టించుకోవడంలేదని వీరి సమస్యకు తక్షణమే పరిష్కారం చూపించాలని గతంలో ఇక్కడ కుష్టు రోగుల కొరకు టి ఎల్ ఎం ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు వీరి కొరకు ప్రత్యేక ఆరోగ్య కేంద్రం నిర్వహించే వారిని సుమారు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి 500 మంది కుష్టు రోగులు లకు ఇక్కడ వైద్యం జరిగేదని కొన్ని పరిస్థితుల వల్ల ఆరోగ్య కేంద్రం మూసి వేయడం జరిగిందని దానివల్ల ఈ ప్రాంతంలో ఉన్న కుష్టు రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వారు వెంటనే స్పందించి వారి కొరకు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఎవరైతే గతంలో టి ఎల్ ఎం ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారితో కూడా సంప్రదింపులు జరపాలని సూచించారు. ఆ యొక్క ఆరోగ్య కేంద్రం పునర్వాహనం జరిగితే కుష్టు రోగులకు చాలా మేలు జరుగుతుందని తెలియజేశారు. ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులే దీనిని దుర్వినియోగం చేస్తున్నారని ఈ ట్రస్ట్ లో ఉన్న సంపదను కొల్లగొట్టుచున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ప్రభుత్వ యంత్రాంగం ఈ సమస్యపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి కుష్టు రోగులను ఆదుకోవాలని ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రామచంద్రపురం సమగ్ర అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

## అభివృద్ధి లక్ష్యంగా పురపాలక సంఘ సమీక్షా సమావేశం



**రామచంద్రపురం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం స్థానిక డాక్టర్ చెలికాని రామారావు పురపాలక సంఘ భవనంలో పురపాలక సంఘ కమిషనర్ కె.వి.ఆర్. రాజు అధ్యక్షతన పట్టణాభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుభాష్ పాల్గొని, పట్టణంలోని ప్రస్తుత సమస్యలు, చేపట్టాల్సిన పనులు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు, వార్డు బాధ్యులు, కూటమి పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులతో విస్తృతంగా చర్చించారు. గడిచిన రెండేళ్లలో పట్టణ అభివృద్ధికి సుమారు యాభై కోట్ల రూపాయల నిధులతో వివిధ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. త్వరలో సుమారు పద్నాలుగు కోట్ల రూపాయల మేర ప్రభుత్వ అభివృద్ధి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని, వీటిని ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సమర్థవంతంగా వినియోగించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి విషయంలో అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసిపి నాయకులను హెచ్చరించారు.

### వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పన

రానున్న నిధులతో ఏయే పనులు చేపట్టాలి, ఏ ప్రాంతానికి ఏ అవసరం ఉంది అనే అంశాలను వార్డుల వారీగా తెలుసుకుని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతామని సుభాష్ పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు కోట్ల రూపాయలతో మూడు పచ్చని ఉద్యానవనాల నిర్మాణం జరుగుతోందని వివరించారు. రహదారి విభజనులు, శివాలయం ఉద్యానవనం, వీఎస్ఎం కళాశాల సమీపంలో ఉద్యానవనం, పడవల విహార కేంద్రం, నడక మార్గం, చెరువు ఆధునీకీకరణ వంటి అనేక పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యతగా ప్రతి వార్డులోని సమస్యను గుర్తించి, పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. స్థానికుల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడంపై పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

### పశువుల వధశాల మూసివేత పట్ల సర్వత్రా హర్షం

సుభాష్ ప్రత్యేక చొరవతో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న చోడవరం పశువుల వధశాల మూసివేతకు చర్యలు తీసుకోవడంపై సమావేశానికి హాజరైన పలువురు ప్రముఖులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ఆటంకంగా, పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉన్న వధశాలను మూసివేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని వారు అభినందించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని పేర్కొన్నారు.

### నిధుల మంజూరుకు సత్వర ప్రతిపాదనలు


పురపాలక సంఘ కమిషనర్ కె.వి.ఆర్. రాజు మాట్లాడుతూ నూతన నిధులకు సంబంధించి సెప్టెంబర్ పదిహేనులోగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉందని తెలిపారు. ప్రతి వార్డులో ఉన్న ప్రధాన సమస్యలు, అవసరమైన మౌలిక వసతులపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరితగతిన పంపుతామని చెప్పారు.

### రాజకీయాలకు అతీతంగా సహకారం అవసరం

కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలకు అతీతంగా పట్టణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఐక్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సుభాష్ ప్రత్యేక శ్రద్ధ, చొరవతో రామచంద్రపురం పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన బాధ్యులు పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు స్థానిక మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, పురపాలక అధికారులు, కూటమి నాయకులు, వార్డుల బాధ్యులు, మాజీ సభ్యులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# చిర్ల జగ్గిరెడ్డిని కలిసిన తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

## అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపిన తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు



**రావులపాలెం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తమ్మన శ్రీనివాస్‌ను కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో, ఆయన మరియు ఆయన కుటుంబ సభ్యులు ఈరోజు గోపాలపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచి, అక్రమ అరెస్టును ఖండిస్తూ తమకు మద్దతుగా నిలిచిన చిర్ల జగ్గిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే తమ్మన శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని వారు వివరించారు. తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు చిర్ల జగ్గిరెడ్డి భరోసా కల్పిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల కోసం పోరాడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# రూ.37.65 కోట్లతో శరవేగంగా గొల్లపాలెం-కుయ్యేరు రహదారి పనులు : పరిశీలించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** దశాబ్దానికి పైగా నిధుల కొరతతో నిర్మాణానికి నోచుకోకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన గొల్లపాలెం-కుయ్యేరు రహదారికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రూ.37.65 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన సుమారు 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కాజులూరు మండలంలో జరుగుతున్న ఈ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి సుభాష్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ఆర్అండ్‌బీ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఇప్పటికే రూ.19.25 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండా కాలయాపన చేసిన గత పాలకులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషప్రచారానికి దిగుతున్నారని మండిపడ్డారు. గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు విషయంలో వైసీపీ నాయకులు ఎన్ని విమర్శలు చేసినా, కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాన్ని గుర్తించి నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించిందన్నారు. వివిధ దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా తారు, ఇతర ముడి సరుకుల లభ్యతలో ఏర్పడిన ఇబ్బందుల వల్ల పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని, ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధిని చూపిస్తున్నామని, రామచంద్రపురం నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో 'సువర్ణ రామచంద్రపురం'గా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. కాజులూరు మండల సమగ్ర అభివృద్ధికి మరో రూ.16 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అలాగే గొల్లపాలెం చెరువు అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో రామచంద్రపురం రూరల్ మండలం చోడవరంలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న కబేళా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, కబేళాను మూసివేసి అక్కడి నిర్వాహకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎంపీడీవో జె రాంబాబు, ఆర్ అండ్ బి జెఈ ప్రసన్న, కాజులూరు మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ఆర్అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల సమన్వయంతో

# అభివృద్ధి,సంక్షేమ లక్ష్యాలను సాధించాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల అమలులో ఆశించిన పురోగతి సాధించడానికి అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ నుండి మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో (ఎంపీడిఓలు) వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....విజిబి రామ్ జి పథకం కింద కూలీలకు పెద్దపీట వేస్తూ వేతన జీవులకు పనుల కల్పన ద్వారా సరాసరి వేతనం పొందే విధంగా ఉపాధి కల్పించాలని,పథకశీ అమల్లో పురోగతి ని ఇంకా పెంచాల్సి ఉందన్నారు..మెట్ట ప్రాంత మండలా లాలలో 100% ఉద్యానవన ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. జలధార – జలహారతి రెండో దశ కింద 6 మండలాల్లో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి (గ్రౌండ్ చేసి) పూర్తి చేసి నివేదికలను పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. మిగిలిన మండలాల్లో పనులను గుర్తించి తక్షణమే ప్రతిపాద న లు వచ్చే వారానికి సిద్ధపరిచి అనుమతులు పొందాలని ఆదేశించారు. తద్వారా ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టి సద్విని యోగం చేసుకునేందుకు మార్గం సుగమశీ అవుతుందన్నారు. ఆ దిశగా పనులు ప్రతిపాదించాలన్నారు. అన్నాక్యాంటీన్ లను సమయానికి తెరవాలని క్లీనింగ్ పరిశుభ్రత, ఆహార నాణ్యత అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సంతృప్తి స్థాయి లను మెరుగుపరచాలన్నారు. గ్రామీణ –పట్టణ తాగు నీటి సరఫరా సమయానికి నాణ్యతతో సరఫరా చేయాలని, త్రాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా మెలకువలు పాటించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రత, సాగునీటి సరఫరా,స్వర్ణ గ్రామం – స్వర్ణ వార్డు' సిబ్బంది హాజరు,ప్రవర్తన మరియు ప్రభుత్వ సేవల అందించడం లోప్రజల సంతృప్తి స్థాయినిపెంచాలని స్పష్టం చేశారు. వెనుక బడిన మండలాల ఎంపీడిఓ లకు పురోగతిపై తగిన దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద పెండింగ్‌లో ఉన్న 9 పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో తాగునీటి వసతులు, సోక్ పిట్ల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం మరియు వాటి ట్యాంకుల క్లోరినేషన్ క్లీనింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ మరియు డిఎంఎఫ్ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసేలా వేగం పెంచాలని ఆదేశించారు. పి 4 ద్వారా బంగారుకుటుంబాలను మార్గ దర్శకులకు దత్తత నిచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేసి పేదరిక నిర్మూలన దిశ గా అధికారులు చిత్తశుద్ధి తో ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలనన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీ సి ఈ ఓ వివిఎస్ లక్ష్మణరావు,డ్వామా పిడి ఎస్ మధు సూదన్, జల వనరుల శాఖ ఈఈ శేషగిరి రావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ మహమ్మద్ అబ్దుల్ మతిన్, తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధురాలి హత్య, బంగారు పుస్తెలతాడు

# చోరీ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

## తుని రూరల్ పోలీసుల దర్యాప్తుకు ఫలితం.. న్యాయస్థానం కీలక



**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలిని హత్య చేసి బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులకు గౌరవ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. పిఠాపురంలోని 12వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి. భాస్కరరావు ఈ కేసులో తుది తీర్పు వెలువరించారు. తుని రూరల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 220/2023లో 302, 380, 397, 506, 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదైంది. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు సునీల్ బాల్కరణ్ ఏ క్యాష్ ఏ అభయ్ సింగ్ (ఉత్తరప్రదేశ్), రాజ్ బిందా సింగ్ (ఒడిశా)లకు 302 ఐపీసీ కింద జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. 506 ఐపీసీ కింద ఏడాది జైలు, రూ.1,000 జరిమానా, 307 ఐపీసీ కింద ఏడేళ్ల జైలు, రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

**2023లో దారుణ ఘటన**

2023 జూలై 16న రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో తుని మండలం ఎర్రకోనేరు గ్రామంలోని హోటల్ వద్ద ఈ ఘటన జరిగింది. పప్పు సత్యవతి తన కుమార్తె నాగమణికి హోటల్ పనుల్లో సహాయం చేసేందుకు అక్కడికి వచ్చారు. రాత్రి సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు హోటల్‌లోకి ప్రవేశించారు. వారిలో ఒకరు నాగమణి మెడపై కత్తి పెట్టి మాట్లాడితే చంపేస్తానని బెదిరించగా, మరొకరు పప్పు సత్యవతిని డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. ఆమె తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో పదునైన కత్తితో దాడి చేశాడు. వీపు, భుజం, ఛాతి భాగాల్లో తీవ్ర గాయాలవడంతో సత్యవతి అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం నిందితులు సత్యవతి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును అపహరించి, ఘటనను చూసేందుకు వచ్చిన వారిని కూడా కత్తులతో బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు.

**దర్యాప్తుతో నిందితుల అరెస్టు**

మృతురాలి కుమార్తె నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ జె. విజయ్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం అప్పటి సీఐ ఎ. సన్యాసి రావు దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులను తుని ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు బలమైన సాక్ష్యాధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు సహా పలు శిక్షలు విధిస్తూ తీర్పు వెలువడింది.

**పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు**

కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. లక్ష్మణ్ దొర సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ కె. తిరుమలరావు సాక్షులను సకాలంలో కోర్టు ముందు హాజరుపరచగా, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జి. ముత్యాల నాయుడు ట్రయల్ సమయంలో విశేషంగా కృషి చేశారు. ప్రస్తుత తుని రూరల్ సీఐ జి. చెన్నకేశవ రావు, అప్పటి సీఐ ఎ. సన్యాసి రావు, అప్పటి ఎస్ఐ జె. విజయ్ బాబు, కేసు దర్యాప్తు, నిందితుల అరెస్టు, న్యాయస్థానంలో బలమైన సాక్ష్యాధారాల సమర్పణలో కృషి చేసిన పోలీసు సిబ్బందితో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు సిబ్బందిని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ అభినందించారు. ట్రయల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా పోలీసులు తెలిపారు.

# ప్రజాఫిర్యాదులకు శాశ్వత, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్జీదారుల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి,సమస్యకు శాశ్వతమైన,నాణ్యమైన,సంతృప్తి కరమైన పరి ష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేం ధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం లో గతంలో అందిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గడువు దాటి పెండింగ్ లో ఉన్న సమస్యల పట్ల ప్రత్యేక చొరవ చూపుతూ గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ అఫిడవిట్ ఫైలు చేసి త్వరితగతిన పరిష్కా రానికిసహకరించాలన్నారు.శాఖల వారీగా ఎప్పటి కప్పుడు ఫిర్యాదు లను ఆడిట్ చేయించి నివేదికల సమర్పించాలన్నారు.ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పీజీ ఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లలో స్వీకరించే అర్జీలను కేవలం గడువు పూర్తయిందనే కారణం తో ముగించకుండా ప్రతి సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలన్నా రు. అర్జీదారుడు మళ్లీ అదే సమస్య పై కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడ కుండా అధికారులు బాధ్యతాయుతంగావ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి,వాస్తవ పరిస్థితులను పరిశీలించి,నిబంధనల మేరకు తగిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారం సంతృప్తి స్థాయిలో ఉండేలా చూడాలని, కేవలం రికార్డుల కోసం అర్జీలను ముగించే విధానాన్ని ఎట్టి పరిస్థితు ల్లో నూ అనుసరించ కూడదని స్పష్టం చేశారు. సమస్యలను నిర్ణీత గడువు లోగా,ఎటువంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులనుఆదేశించారు. రెవెన్యూ భూ సమస్యల పరిష్కారంలో సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారుల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుపై సత్వర విచారణ, నాణ్యమైన పరిష్కారం, స్పష్టమైన ఎండార్స్ మెంట్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.అర్జీల పరి ష్కారానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటి కప్పుడు నమోదుచేయాలన్నారు.... ప్రజా ఫిర్యాదుల పరిష్కారం జిల్లా పరిపాలనలో అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్న జిల్లా కలెక్టర్, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థ వంతంగా అందించేందుకు అధికారులు అంకితభావం తో పని చేయాలన్నారు.ప్రతిఫిర్యాదుదారుడి కి స్పష్టమైన,శాశ్వతమైన మరియు సంతృప్తికరమైన పరిష్కారం అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఓ డాక్టర్ డి తిప్పే నాయక్, డిడిఓ పి వాసుదేవరావు, జడ్పీ సీఈవో వివిఎస్ లక్ష్మణ రావు, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు నోడల్ అధికారి జే వేణుగోపాల్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

# అన్ని గ్రామాల్లో రోడ్లని పూర్తి చేస్తాం

### మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం గొల్లపాలెం నుండి కుయ్యేరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వర్యులు వాసంశెట్టి సుభాష్ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు గొల్లపాలెంలో తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కాజులూరు మండల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే కాజులూరు రోడ్డు నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కాజులూరు మండల గ్రామాల్లో ఇప్పటికే చాలా వరకూ రోడ్లు పూర్తి చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో ప్రాధాన్యతా క్రమంలో అన్ని రోడ్ల నిర్మాణాల్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, మండల టీడీపీ అధ్యక్షుడు చావ్వాకుల నారాయణమూర్తి, జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, బోండా వెంకన్న, చుండ్రు వీర్రాజు చౌదరి, తాడి మాచారెడ్డి, గుబ్బల యేసురాజు, మేడిశెట్టి వీరవెంకటసత్యనారాయణ, వల్లు అర్జునరావు, రెడ్డి శేషారావు, వడ్డాది ధరణి తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు : రాష్ట్ర ఎన్నికల సంఘం

**విజయవాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని రూరల్ మరియు అర్బన్ స్థానిక సంస్థలకు 2వ సాధారణ ఎన్నికల తేదీలు మరియు షెడ్యూల్‌లతో కూడిన తప్పుడు వార్తలు/సమాచారం శాఖ/సంస్థ పేరుతో మరియు అధికార చిహ్నాలను అనుమతులు లేకుండా వాట్సాప్ ద్వారా ప్రసారం చేస్తున్నట్లు ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి వచ్చింది. పర్యవసానంగా, ప్రసారం అవుతున్న సమాచారం యొక్క ప్రామాణికతకు సంబంధించి వివరణ కోరుతూ వివిధ వర్గాల నుండి కమిషన్ కార్యాలయానికి ఫోన్ కాల్స్ వెల్లువెత్తుతున్నాయి. చెప్పబడిన సమాచారం నకిలీదని,ప్రమాణీకరించబడదని మరియు నిజమైనది కాదని దీని ద్వారా స్పష్టం చేయబడింది.అటువంటి ధృవీకరించబడని సమాచారాన్ని విశ్వసించ వద్దని, ప్రసారం చేయవద్దని లేదా పంచుకోవద్దని ప్రజలను అభ్యర్థించారు. వర్తించే సైబర్ చట్టాలు/నిబంధనలకు అనుగుణంగా, ఉద్దేశపూర్వకంగా తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని సృష్టించడం, ప్రచారం చేయడం లేదా ప్రచారం చేయడం వంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. ఎన్నికల విషయాలకు సంబంధించి ఏదైనా నిజమైన మరియు అధికారిక సమాచారం కమిషన్ అధికారిక ప్రెస్ నోట్/కాన్ఫరెన్స్ ద్వారా మాత్రమే ప్రజలకు తెలియజేయబడుతుంది. అనధికారిక మూలాలు లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా జారీ చేయబడిన సమాచారం ప్రామాణికమైనదిగా పరిగణించరాదు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మరియు ధృవీకరించబడిన అధికారిక కమ్యూనికేషన్ లపై మాత్రమే ఆధార పడాలని సూచించారు. ప్రజలు మరియు మీడియా, A.P. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే అధికారిక సమాచారాలపై మాత్రమే ఆధారపడాలని మరియు ఏదైనా తదుపరి సమాచారం కోసం అధికారిక ప్రెస్ నోట్/కాన్ఫరెన్స్ కోసం వేచి ఉండాలని అభ్యర్థించారు.

# భార్యాభర్తల హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తలను హత్య చేసి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించింది. ముద్దాయి అంబాటి వీర్రాజుకు 302 ఐపీసీ కింద జీవిత ఖైదు, రూ.5,000 జరిమానా, 380 ఐపీసీ కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ కాకినాడ VI అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి శ్రీ పి. గోవర్ధన్ తీర్పు ఇచ్చారు. కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రయల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే 2019లో నమోదైన టూ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ క్రైం నంబర్ 171/2019 కేసులో నిందితుడికి శిక్ష పడింది.


**అప్పులు తీర్చుకునేందుకు దారుణ హత్యలు**

పోలీసుల వివరాల ప్రకారం.. 2019 జూన్ 6/7వ తేదీ రాత్రి కాకినాడ సూర్యారావుపేట ముమ్మిడివారి వీధిలో నివసిస్తున్న తుమ్మలపల్లి సత్యానందం, ఆయన భార్య తుమ్మలపల్లి మంగతాయారును అంబాటి వీర్రాజు హత్య చేశాడు. షేర్ మార్కెట్‌లో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయిన నిందితుడు, సత్యానందం వద్ద డబ్బు, బంగారం ఉన్నట్లు గతంలో తెలుసుకున్నాడు. అప్పులు తీర్చుకునేందుకు అడ్డదారిలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న నిందితుడు.. సత్యానందం, మంగతాయారును హత్య చేసి వారి వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దోచుకోవాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ముందుగానే తెచ్చుకున్న సుత్తితో వారిపై దాడి చేసి హత్య చేసిన అనంతరం సాక్ష్యాలను తారుమారు చేసి అక్కడి నుంచి పరారైనట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసును అప్పటి ఎస్ఐ శ్రీ ఎన్. రామకృష్ణ నమోదు చేయగా, టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పి. ఈశ్వరుడు దర్యాప్తు నిర్వహించారు. నిందితుడిని అరెస్టు చేసి, బలమైన సాక్ష్యాధారాలతో ఛార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు.

**బలమైన సాక్ష్యాలతో శిక్ష**

కేసు విచారణలో ఏపీపీ శ్రీ ధనుంజయ వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ లోవరాజు సాక్షులను సకాలంలో న్యాయస్థానానికి హాజరుపరచగా, జిల్లా కోర్టు లైజనింగ్ అధికారి శ్రీ జి. మధుబాబు ట్రయల్ సమయంలో సమన్వయం చేస్తూ కీలకంగా కృషి చేశారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, న్యాయస్థానంలో బలమైన సాక్ష్యాధారాలు సమర్పించిన ఇన్‌స్పెక్టర్ శ్రీ మజ్జి అప్పలనాయుడు, అప్పటి ఎస్ఐ శ్రీ ఎన్. రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీ పి. ఈశ్వరుడు, ఏపీపీ శ్రీ ధనుంజయ, కోర్టు కానిస్టేబుల్ లోవరాజు, సతీష్, జిల్లా కోర్టు లైజనింగ్ అధికారి శ్రీ జి. మధుబాబులను జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 59 ఫిర్యాదులు



**కాకినాడ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ 59 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 21, కుటుంబ కలహాలకు సంబంధించి 11, ఇతర సమస్యలకు సంబంధించి 27 ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేసి, తగిన పరిష్కారం చూపడంతో పాటు విచారణ వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు.

ఏడేళ్ల నిరీక్షణకు ముగింపు..

# డీఎస్సీ విజేతలే అందుకు సాక్షి

- కష్టపడి సాధించిన ఉద్యోగాలపై దుష్ప్రచారం సరికాదు.. : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ధైర్యంగా నిలబడాలని సూచన
- ఐదుగురు నూతన ఉపాధ్యాయినులకు అభినందనలు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :**ఇటీవల జరిగిన డీఎస్సీలో విజయం సాధించి ఉపాధ్యాయులుగా నియా మకం పొందిన నగరానికి చెందిన ఐదుగురు నూతన ఉపాధ్యాయిను లను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్వయంగా కలిసి అభినందించారు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి విజయ గాథలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యా యినులు 10వ డివిజన్‌కు చెందిన ముసలి గంటి సంతోషి రమా కల్యాణి, 3వ డివిజన్‌కు చెందిన గంటి గేయరూపిణి, 45వ డివిజన్‌కు చెందిన నయనాల కేదారేశ్వరి, 37వ డివిజన్‌కు చెందిన గిరిజ కుమారి, 35వ డివిజన్‌కు చెందిన కుసుమ రత్న సౌజన్యలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కలిసి వారి విజయాన్ని అభినందించారు. వారిని సత్కరించి, ప్రత్యేకంగా నగరానికి చెందిన ప్రసిద్ధ రత్నం పెన్నులను జ్ఞాపికగా అందజేశారు.

**గర్భిణీగా ఉన్నప్పుడే చదివి విజయం**

డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన సమ యంలో తాను గర్భిణీ అని ఓ అభ్యర్థిని తెలిపారు. ప్రసవం జరిగిన తర్వాత కూడా పరీక్షకు సిద్ధమై, తీవ్ర శ్రమతో పరీక్ష రాసి విజయం సాధించడం అందరినీ కదిలించింది. కుటుంబ బాధ్య తలు, శారీరక ఇబ్బందులు ఉన్నప్పటికీ చదువును వదలకుండా ఉద్యోగం సాధించిన ఆమె పట్టుదలను ఎమ్మెల్యే వాసు ప్రత్యేకంగా అభినందించారు.మరో ఉపాధ్యాయిని ప్రభుత్వ పాఠశాలలో చదివి, ఇప్పుడు అదే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయురాలిగా సేవలందించే స్థాయికి చేరడం పట్ల ఎమ్మెల్యే వాసు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ చదువు కొనసాగించి ఉద్యోగం సాధించిన వారి కృషిని కొనియాడారు.

**భర్త ప్రోత్సాహంతో కల నెరవేర్చుకున్న ఉపాధ్యాయిని**

చిన్న వయసులోనే వివాహం జరిగినప్పటికీ చదువును ఆపకుండా, భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి డీఎస్సీ సాధించిన ఉపాధ్యాయినితో కూడా ఎమ్మెల్యే వాసు మాట్లాడారు. ఆమె విజయం వెనుక కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భర్త అందించిన ప్రోత్సాహం కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.నూతన ఉపాధ్యాయినులు మాట్లాడుతూ డీఎస్సీ కోసం అనేక సంవత్సరాలుగా నిరీక్షించామని, ఉద్యోగం సాధించడమే తమ జీవిత లక్ష్యంగా రాత్రింబవళ్లు కష్టపడి చదివామని తెలిపారు. కుటుంబం, పిల్లలు, వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి ఉద్యోగం కోసం ఎంతో శ్రమించామని, చివరకు తమ కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని భావోద్వేగంగా చెప్పారు. డీఎస్సీ ఉద్యోగాలు తమ జీవితాలను మార్చాయని, కుటుంబానికి భరోసా కల్పించాయని పేర్కొన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా డీఎస్సీ కోసం ఎదురుచూసిన వేలాది మంది అభ్యర్థులు తీవ్రంగా కష్టపడి ఈ ఉద్యోగాలను సాధించారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నిర్వహించి, అత్యంత పారదర్శకంగా నియామక ప్రక్రియను పూర్తి చేసిందని తెలిపారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై వైకాపా అవినీతి ఆరోపణలు చేయడం, డబ్బులు ఇచ్చి ఉద్యోగాలు కొనుగోలు చేశారంటూ ప్రచారం చేయడం డిఎస్సీ అభ్యర్థుల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు.నూతన ఉపాధ్యాయులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. “నిజం ఎప్పటికైనా నిజమే... అబద్ధాన్ని పదిసార్లు చెప్పినంత మాత్రాన అది నిజం కాదు... మీ కష్టంతో మీరు ఉద్యోగాలు సాధించారు... మీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలి” అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉపాధ్యాయినులతో అన్నారు.కొత్తగా ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన వారికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందనలు తెలుపుతూ, మీ చేతుల ద్వారా భవిష్యత్తులో మంచి విద్యార్థులను, బాధ్యతాయుతమైన పౌరులను, ఉత్తమ అధికారులను తయారు చేయాలని ఆకాంక్షించారు. “మీ విజయం ఇక్కడితో ఆగిపోకూడదు. మీరు చదివించే పిల్లలు భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరేలా తీర్చిదిద్దాలి... గురుదేవోభవ అన్న మాటకు తగ్గట్టుగా ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తీసుకురావాలి” అని సూచించారు.

# మన ప్రాంతంలో లవ్ జిహాది జరగడం దురదృష్టకరం

**ఇది ఒక వ్యక్తి ఆలోచన కాదు ముఠా ఆలోచన**

**సాధిక్ ఖాన్ అంశాన్ని ఇంటెలిజెన్స్ అధికారులు సీరియస్‌గా పరిగణించాలి : ఎమ్మెల్సీ సోము వీర్రాజు**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :**మన ప్రాంతంలో లవ్, జిహాది కేసు నమోదు కావడం దురదృష్టకరమని,ఈ సంఘటనలో భర్తకు ఇంజక్షన్ చేసి సాధిక్ ఖాన్ చంపేశాడని భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపించారు. క్వారీ మార్కెట్ సెంటరులోని బీజేపీ కార్యాలయంలో సోమవారం సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ సాధిక్ ఖాన్‌కు ఇంటర్నేషనల్ స్థాయిలో లింకులు ఉన్నాయని,ఇతనికి ఢిల్లీలో కొంతమంది వ్యక్తులు షెల్టర్ ఇచ్చారని చెప్పారు. మతం తీసుకోవాలని నూకరాజు కుటుంబంపై ఒత్తిడి చేశాడని,ఇది ఒక వ్యక్తి ఆలోచన కాదు ఒక ముఠా ఆలోచన అని, దీనిని బయట పెట్టాల్సిన అవసరం పోలీసులపై ఉందన్నారు.ఈ విషయంలో ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు సీరియస్‌గా పని చేయాలని కోరారు.అమ్మాయిలను ట్రాప్ చేసేందుకు షాపింగ్ మాల్స్, జిమ్, వేదికలవుతున్నాయని సోము వీర్రాజు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంపై హోంమంత్రి కానీ, డిజీపి గానీ ఇప్పటివరకు స్పందించలేదని విచారం వ్యక్తం చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ లోని కాదు భారతదేశంలో కూడా హిందువులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన చెందారు.మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణలపై అసెంబ్లీలో సమాధానం చెప్పామని,వైసిపి ఎమ్మెల్సీలు కౌన్సిల్ సమావేశాలు సరిగా జరగ నివ్వలేదని ఆయన విమర్శించారు.దీనిపై సిబిఐ విచారణ జరిపించడం అంటే కొత్తిమీర వ్యాపారం కాదన్నారు.గత ప్రభుత్వ హయాంలో 15 వేల కోట్లతో భూములు కొన్నారని, వీటిలో ఐదు వేల కోట్లు అప్పటి వైసీపీ నేతలు నొక్కేశారని ఆరోపించారు.మద్యం కుంభకోణం విషయంలో కూడా సిబిఐ విచారణ చేయాలా ...? అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నించారు.సిట్ ఇచ్చిన సాక్షాల ఆధారంగానే ఈడి రంగప్రవేశం చేసిందన్నారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉండడానికి కారణం కమ్యూనిస్టులేనని మండిపడ్డారు.గోదావరి జిల్లాలో కూడా పారిశ్రామిక అభివృద్ధి జరగాలని ఆయన కోరారు.విలేకరుల సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర,అడబాల రామకృష్ణ, కురగంటి సతీష్,కాలెపు సత్య సాయిరామ్,వీర వీరాంజనేయులు, గుర్రాల వెంకట్రావు,మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభిమానులను సేవా మార్గంలో నడిపించిన చిరంజీవి

**రాజమహేంద్రవరంలో చిరంజీవి 71వ జన్మదిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేసిన మంత్రి**

**కొత్త సినిమా ‘కాకా’ గ్లింప్స్‌లో చిరంజీవి లుక్ అదిరిందని కొనియాడిన మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** అభిమానులను సేవా మార్గంలో నడిపించిన మహోన్నత వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. శనివారం రాత్రి రాజమహేం ద్రవరంలోని జెండాపంజా రోడ్డులో రామినీడి మురళీ నివాసం వద్ద నిర్వహించిన మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో మంత్రి పాల్గొని మెగాస్టార్ కు బర్త్ డే విషెస్ తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. నాటి రోజుల్లో సినిమా హీరోలంటే కేవలం థియేటర్లలో కేరింతలు కొట్టడం, విడుదల రోజే పండుగ చేసుకోవడం వరకే ఉండేదని, అందుకు భిన్నంగా అభిమానులను సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసిన దేశ చరిత్రలోనే తొలి హీరో చిరంజీవి అని కొనియాడారు. నేత్రదానం, రక్తదానం వంటి సామాజిక కార్యక్ర మాలతో తనదైన ముద్ర వేశారని, రికార్డు స్థాయిలో రక్తదానాలు చేస్తూ బ్లడ్ బ్యాంకును స్థాపించి, దశాబ్ద కాలంగా ఎందరో ఆపన్నులకు ప్రాణదానం చేస్తున్నారని తెలిపారు.మెగాస్టార్ చిరంజీవి 71వ ఏట కూడా ఎంతో ఉత్సాహంగా, యూత్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ తన కొత్త చిత్రం ‘కాకా’తో అలరించేందుకు సిద్ధమవ్వడం అభినందనీయమన్నారు. ఈ చిత్రానికి ఆల్ ది బెస్ట్ తెలుపుతూ ఆయన ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తనకు మంత్రి పదవి లభించిందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. నిడదవోలు ప్రజల ఆశీస్సులతో, తనకు అప్పగించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, జిల్లా మంత్రిగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోతూ న్యాయం చేస్తానని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన సభా నిర్వాహకుడు రాజాను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రామినీడి మురళీ, భరణి, శేషు నారాయణ ,మాలే విజయలక్ష్మీ, బెజవాడ రంగారావు,యజ్జరపు మరిడయ్య,టి.శ్రీనివాస్ యాదవ్, చాపల చిన్నరాజు, అనంతలక్ష్మీ, షేక్ సుభానీ బబ్లూ, పెద్ద సంఖ్యలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పాల్గొని వేడుకను జయప్రదం చేశారు.

రాజవరం, గాదరాడ-2 గ్రామాలకు

# వైసీపీ గ్రామ కమిటీలు





**కోరుకొండ, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని వివిధ గ్రామాల అనుబంధ విభాగాలకమిటీలను నియమించినట్లు వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ప్రకటన విడుదల చేశారు. సోమవారం రాజవరం గ్రామకమిటీ అధ్యక్షుడిగా నెక్కంటి రామ్మోహన్‌ను,విద్యార్థి విభాగానికి తాతపూడి రాంబాబు, యువజన విభాగానికి ఇందల సతీష్, మహిళా విభాగానికి ద్వారపూడి భవాని, సోషల్ మీడియా విభాగానికి ద్వారపూడి రాజు, ప్రచార విభాగానికి జాజుల నాగు, రైతు విభాగానికి పంపనబోయిన సింగరయ్య, వాలంటీర్ విభాగానికి ద్వారపూడి వీరబాబు, ఎస్సీ మాదిగ విభాగానికి జొన్నకూటి శామ్యూల్, బీసీ విభాగానికి రాపర్తి రామకృష్ణను నియమించినట్లు రాజా తెలిపారు. అదేవిధంగా గాదరాడ-2 గ్రామకమిటీ అధ్యక్షుడిగా వనుం గంగాధర్‌ను నియమించారు.విద్యార్థి విభాగానికి చీర్ల రాజ్‌కుమార్,యువజన విభాగానికి చీర్ల పుల్లేశ్వరరావు, మహిళా విభాగానికి దోసపాటి భాగ్యలక్ష్మి, సోషల్ మీడియా విభాగానికి దేవన రాంబాబు, ఐటీ విభాగానికి చీర్ల వీరబాబు, ప్రచార విభాగానికి చీర్ల సోమన్న, రైతు విభాగానికి చీర్ల బాలాజీ, వాలంటీర్ విభాగానికి దేవరపల్లి శేషుకుమార్, ఎస్సీ మాల విభాగానికి కందికట్ల ప్రవీణ్‌కుమార్, ఎస్సీ మాదిగ విభాగానికి రామవరపు దేవదాస్, బీసీ విభాగానికి గొడ్డు వీరభద్రం, క్రిస్టియన్ మైనారిటీ విభాగానికి నూకతట్టి ప్రసన్నకుమార్, వాణిజ్య విభాగానికి కందికట్ల పాపన్న, వైఎస్సార్‌సీపీ ఆటో విభాగానికి వనుం సత్యనారాయణను నియమించినట్లు జక్కంపూడి రాజా వెల్లడించారు. నూతన కమిటీల సభ్యులు ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యలపై పార్టీ తరపున పోరాడి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

# టెక్నాలజీతో పోయిన ఫోన్లు పట్టేశారు!

**రూ.4.86 లక్షల విలువైన 40 సెల్‌ఫోన్లు బాధితుల చెంతకు**



**ధవళేశ్వరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు ఇక తిరిగి రావని నిరాశలో ఉన్న బాధితులకు ధవళేశ్వరం పోలీసులు ఊరటని చ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి రూ.4.86 లక్షల విలువైన 40 ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అప్పగించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులను CEIR పోర్టల్‌లో నమోదు చేసి, వాటి ఆధారంగా పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 40 సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సౌత్‌జోన్ డీఎస్పీ శివప్రియ రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. నెలల తరబడి తమకు దూరమైన ఫోన్లు తిరిగి చేతికి రావడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. ఒక్క ఫిర్యాదుతో వదిలేయకుండా టెక్నాలజీని ఉపయోగించి ఫోన్లను గుర్తించడం పోలీసుల పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 500 సెల్‌ఫోన్ ఫిర్యాదులు నమోదు కాగా, 230 ఫోన్లను ట్రేస్ చేసి, 130 ఫోన్లను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు CEIR పోర్టల్‌లో కూడా వివరాలు నమోదు చేసుకోవాలని డీఎస్పీ శివప్రియ సూచించారు. అదే సమయంలో సైబర్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ రికవరీలో కీలకంగా వ్యవహరించిన ధవళేశ్వరం సీఐ గణేష్, ఎస్సై హరిబాబు, ఎస్సై విజయ్‌కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని డీఎస్పీ శివప్రియ అభినందించారు.

# కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు

**వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి**




**రాజమహేంద్రవరం, ఆగస్టు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి పాలనలో మహిళ లకు రక్షణ లేదని వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోపించారు. రాజమండ్రి నుంచి రాష్ట్ర రాజధాని వరకు మహిళలు బయటకు రావా లంటే భయపడుతున్నారని అన్నారు. దానవాయిపేట లోని తన నివాసంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లా డుతూ సంఘసంస్కర్త కందుకూరి వీరే శలింగం నడయాడిన రాజమండ్రి గడ్డమీద కూడా మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.డాక్టర్ ప్రియాంక యాక్సిడెంట్, గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న నూకరాజు కుటుంబం గురించి ఆమె ఉదహరిం చారు. మహిళలు అర్ధరాత్రి నిర్భయంగా రోడ్డు మీద వెళ్ళే పరిస్థితి ఉండాలని మహాత్మాగాంధి అన్నారని,కాని ఇప్పుడు పట్టపగలే మహిళలు బయటకు రాలేని దుస్థితి ఉందని జక్కంపూడి విజయలక్ష్మి మండిపడ్డారు. మహిళల రక్షణ కోసం జగన్ మోహన్ రెడ్డి పాలనలో దిశ చట్టం చేస్తే కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని లేకుండా చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో పలుచోట్ల అధికారపార్టీ ఎమ్మెల్యేలు మహిళలపట్ల అనుచితంగా ప్రవర్తిస్తుంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆమె విమర్శించారు. మంత్రి గుమ్మడి సుధ్యారాణి పి.ఎ.ఒక మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తిం చారని అతడి తప్పును కప్పిపుచ్చడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. చీటికి మాటికి జగన్‌ను విమర్శించే మంత్రి సంధ్యా రాణి, హోం మంత్రి అనిత రాష్ట్రంలో మహిళపట్ల జరుగుతున్న అన్యాయాలపై ఎందుకు నోరెత్తైతడం లేదని జక్కంపూడి విజయలక్ష్మి ప్రశ్నించారు.రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరు బాగాలేదని విమర్శించారు.వైసీపీ నాయకులపై కేసులు పెట్టడానికే లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం ఉందా అని ప్రశ్నించారు.చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను,ముఖ్యంగా మహిళలను మోసం చేస్తున్నారని ఆమె విమర్శించారు.ప్రజలు అన్నీ గమనిస్తున్నారని,సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని జక్కంపూడి విజయలక్ష్మి హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో పోలు విజయలక్ష్మి,మహిళా నాయకులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

ట్రోలర్స్, హేటర్స్, ఫ్యాన్స్‌కీ

# అల్లు అర్జున్ ఇచ్చిన స్టేట్మెంట్ ఇదే!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఇప్పుడు నటిస్తున్న అవైటెడ్ చిత్రమే "రాకా". దర్శకుడు అట్లీతో చేస్తున్న ఈ మాసివ్ ప్రాజెక్ట్ షూట్ కి చిన్న గ్యాప్ ఇచ్చి బన్నీ లేటెస్ట్ గా తన ఫ్యాన్స్ తో ఇంటరాక్ట్ అవ్వడం జరిగింది. దాదాపు 2000 మంది తన అభిమానులతో మీటప్ అయ్యిన బన్నీ ఇందులో చాలానే విషయాలు షేర్ చేసుకున్నారు. ఇలా మంచి సందర్భం వచ్చింది కాబట్టి తన అభిమానులకి అనే కాదు ట్రోల్స్ చేసే వారికీ, హేట్ చేసేవారికి కూడా ఒకటే స్టేట్మెంట్ ని అందించడం వైరల్ గా మారింది. మీకు ఒకటి నచ్చలేదు అంటే అసలు ఆ విషయాన్ని పట్టించుకోవడం మానెయ్యండి అని మీకు నచ్చని విషయంపై ఎందుకు మీ టైం వేస్ట్ చేసుకుంటున్నారని ఐకాన్ స్టార్ హితవు పలికారు. అంతే కాకుండా దీనికి మంచి ఉదాహరణ కూడా అందించడం జరిగింది. నీ దగ్గర 100 రూపాయలు ఉంటే అవి నీకు నచ్చని వాటి మీద ఖర్చు పెట్టవు కదా ఇది కూడా అలానే నీకో విషయం నచ్చనపుడు సమయం వృధా చేసుకోకుండా నీకు నచ్చిన మరో పని చేసుకోమని చెప్పడం ఈ మీట్ లోనే ఒక హైలైట్ స్టేట్మెంట్ గా నిలిచి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# 'లెనిన్' బ్యూటీకి అవమానాలు..

## వాట్సాప్‌లో బ్లాక్ వరకూ

వెండితెరపై ఒక నటుడో లేదా నటి రాణించాలి అంటే అది అంత సులువు కాదు. తాము తెరపై కనిపించి నిలదొక్కుకోవాలి అంటే ఆ ప్రయాణం ఎవరికీ అంత సజావుగా సాగదు. అలానే లేటెస్ట్ టాలీవుడ్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే కూడా తన జర్నీ విషయంలో చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. చాలామందికి ఇంట్లో సినిమాల్లోకి వెళతాను అని చెబితే వద్దనే సమాధానం ఎలా వినిపిస్తుందో అదే సమాధానం భాగ్యశ్రీకి కూడా ఎదురైందట. ఇలా సినిమాల్లోకి వెళతాను అంటే తన జర్నీలో ఎవరూ తన కుటుంబం నుంచి చిన్న ప్రోత్సాహం కూడా అందించలేదని ఆమె రీసెంట్ ఓ ఇంటరాక్షన్ లో చెప్పుకొచ్చింది. అంతేకాకుండా తన నిర్ణయాన్ని విని వాట్సాప్ లో కూడా బ్లాక్ చేసారని ఆమె ఇంకో షాకింగ్ విషయాన్ని కూడా ఆమె లైఫ్ నుంచి షేర్ చేసుకుంది. ఇలా ఆమెకి కూడా కొన్ని అవమానాలు ఎదురుకాక తప్పలేదు. అయితే తాను ఏం చేసిన తన కుటుంబం ఆర్థికంగా నిలబడాలి అనే చేసానని ఇటీవల అఖిల్ 'లెనిన్' ప్రయాణంలో చెప్పుకొచ్చింది. ఇప్పుడు ఆమె కోరుకున్న సక్సెస్ కూడా అందుకొని ఆ వైబ్ ని ఎంజాయ్ చేస్తుంది.



# బ్రహ్మ ముహూర్తంలో ఎపిక్ 'రామాయణ' ట్రైలర్ ఫిక్స్.. ఎప్పుడంటే..?

బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ బిగ్ బడ్జెట్ మూవీ 'రామాయణ' ట్రైలర్ ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల అది వాయిదా పడింది. ఇక ఎప్పుడెప్పుడు ఈ ట్రైలర్ వస్తుందా అని ఎదురుచూస్తున్న ప్రేక్షకులు మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ చిత్ర ట్రైలర్ విడుదలకు మేకర్స్ ముహూర్తం ఖరారు చేశారు. ఈ ప్రెస్టీజియస్ ట్రైలర్‌ను జూలై 30 తెల్లవారుజామున 4:15 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఎంతో పవిత్రమైన బ్రహ్మ ముహూర్తంలో ఈ ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు మేకర్స్ ఓ పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ దివ్యమైన సమయాన్ని ఎంచుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రణ్‌బీర్ కపూర్ రాముడిగా సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తున్న ఈ ప్రెస్టీజియస్ చిత్రం కోసం సినీ ప్రియులు, అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. జూలై 30న రాబోతున్న ఈ ట్రైలర్ ఎలాంటి విజువల్ వండర్‌ను ఆవిష్కరిస్తుందో చూడాలి.




# రెండో రోజూ భారత్‌దే.. ముగిసిన ఆట.. శ్రీలంక 8/2

శ్రీలంక, భారత్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 8/2తో ఉంది. ప్రభాత్ జయసూర్య (2) రెండో వికెట్‌గా ఔటైన తర్వాత ఆట ముగిసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం కమిల్ మిశ్రా (5లి) క్రీజులో ఉన్నాడు. లంక ఇంకా 495 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు షాక్ తగిలింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో లహిరు ఉదార (1) పెవిలియన్ చేరాడు. ఔట్‌సైడ్ ఎడ్జ్ అయిన బంతి నేరుగా థర్డ్ స్లిప్‌లో ఉన్న జైస్వాల్ చేతిలో పడింది. 2 ఓవర్లకు శ్రీలంక స్కోరు 2/1.

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా భారీ స్కోరు చేసింది. 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ఏడు పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (115, 177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆదివారం మూడు పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ అయిన రిషభ్ పంత్ (63; 89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి అర్ధ శతకం బాదాడు. మానవ్ సుతార్ (18) పరుగులు చేసి వెనుదిరిగాడు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 2, కేశర నువాంతు 2, లాహిరు కుమార ఒక వికెట్ పడగొట్టారు. తర్వాత శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా.. రెండు బంతులు పడగానే ఆకాశం మేఘావృతం కావడంతో ముందు జాగ్రత్తగా ఆటను నిలిపి వేసి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు.

ఆట తిరిగి ప్రారంభం కాగా.. భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 171 బంతుల్లో అతను మూడంకెల స్కోరు అందుకున్నాడు. జురెల్ 99 పరుగులకు చేరిన తర్వాత సెంచరీ అందుకోవడానికి 13 బంతులు తీసుకున్నాడు. అయితే, శతకం పూర్తి చేసుకున్న తర్వాత ఎదుర్కొన్న తొలి బంతినే జురెల్ సిక్సర్‌గా మలిచాడు. అనంతరం ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో సిరాజ్ (3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడంతో భారత్ తొమ్మిదో



వికెట్ కోల్పోయింది. 137 ఓవర్లకు భారత్ స్కోరు 489/9. జురెల్ (106)తోపాటు ప్రసిద్ధ్ కృష్ణ క్రీజులో ఉన్నారు.

వర్షం తగ్గిపోవడంతో మ్యాచ్‌ను కొనసాగించేందుకు మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. 4:25 గంటలకు ఆట తిరిగి ప్రారంభంకానుంది. సరైన వెలుతురు ఉండి వాతావరణం అనుకూలిస్తే సాయంత్రం 6 గంటల వరకు ఆట నిర్వహించనున్నారు.

కొలంబోలో వర్షం కురవడం ఆగిపోయింది. ప్రస్తుతం ఎండ కూడా కాస్తోంది. దీంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా సిబ్బంది మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు.

రెండో టెస్టుకూ వరుణుడు అంతరాయం కలిగించింది. దీంతో ఆటను అంపైర్లు నిలిపివేశారు. మైదానాన్ని సిబ్బంది కవర్లతో కప్పేశారు. ప్రస్తుతం భారత్ స్కోరు 131.2 ఓవర్లకు 475/8. ధ్రువ్ జురెల్ (95లి) సెంచరీకి చేరువగా వచ్చాడు. అతడితోపాటు క్రీజ్‌లో మహ్మద్ సిరాజ్ ఉన్నాడు. వర్షం రావడంతో టీ బ్రేక్‌ను ముందే ప్రకటించారు.

భారత్ ఎనిమిదో వికెట్‌ను నష్టపోయింది. ఇక ప్రభాత్ జయసూర్యకు ఎట్టకేలకు వికెట్ దక్కింది. జయసూర్య వేసిన (124.4వ ఓవర్) బంతిని ఆడే క్రమంలో మానవ్ సుతార్ (18) వికెట్ కీపర్ డిక్వెల్లాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ప్రభాత్‌కు ఇది 36వ ఓవర్ కావడం గమనార్హం. ప్రస్తుతం భారత్ స్కోరు 458/8.

భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతోంది. రిషభ్ పంత్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ (13లి) కూడా క్రీజ్‌లో పాతుకుపోయాడు. మరోవైపు ధ్రువ్ జురెల్ (76లి) కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అనవసమైన షాట్లకు పోకుండా పరుగులు రాబట్టడంపైనే భారత బ్యాటర్లు దృష్టి పెట్టారు. ప్రస్తుతం భారత్ స్కోరు 122 ఓవర్లకు 450/7.

రిషభ్ పంత్ (63) ఔటయ్యాడు. లంచ్ బ్రేక్ తర్వాత ఆడిన తొలి బంతికే పెవిలియన్‌కు చేరడం గమనార్హం. కేశర నువాంత వేసిన (112.1వ ఓవర్) తొలి బంతిని పంత్ భారీ షాట్ కొట్టాడు. కానీ, డీప్ మిడాఫ్‌లో లాహిరు ఉదారా చేతికి చిక్కాడు. దీంతో ధ్రువ్ జురెల్‌తో ఏడో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం బ్యాటింగ్‌కు మానవ్ సుతార్ వచ్చాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 113 ఓవర్లకు 419/7. క్రీజ్‌లో సుతార్, ధ్రువ్ జురెల్ (59లి) ఉన్నారు.

శ్రీలంకతో రెండో టెస్టు రెండో రోజు ఆటలో తొలి సెషన్ ముగిసింది. లంచ్ బ్రేక్ సమయానికి భారత్ స్కోరు 419/6. క్రీజ్‌లో రిషభ్ పంత్ (63లి), ధ్రువ్ జురెల్ (59లి) ఉన్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు ఇప్పటి వరకు 112 పరుగులు జోడించారు. ఇక ఈ సెషన్‌లో భారత్ 119 పరుగులను రాబట్టింది. భారత బ్యాటర్లు రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్ అర్ధశతకాలు సాధించారు. తొలుత 81 బంతుల్లో పంత్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. కెరీర్‌లో ఇది అతడికి 21వది. తర్వాత ధ్రువ్ జురెల్ 99 బంతుల్లో తన మూడో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకొన్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం కూడా సెంచరీకి చేరువగా ఉంది. ప్రస్తుతం భారత్ స్కోరు 110 ఓవర్లకు 403/6. క్రీజ్‌లో పంత్ (51లి), ధ్రువ్ జురెల్ (55లి) ఉన్నారు.

భారత ఆటగాడు రిషభ్ పంత్ అద్భుతమైన ఘనత సాధించాడు. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని అధిగమించాడు. విదేశీ గడ్డపై టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు నమోదు చేశాడు. ధోని 2,496 పరుగులు చేయగా.. పంత్ 2500 పరుగుల మైలురాయిని దాటేశాడు. శ్రీలంకతో రెండో టెస్టులో పంత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తున్నాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 103 ఓవర్లకు 376/6. క్రీజ్‌లో పంత్ (39లి), ధ్రువ్ జురెల్ (40లి) ఉన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

అసిత ఫెర్నాండోతో గొడవ..

# యశస్వి జైస్వాల్‌కు జరిమానా



శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు భారత ఆటగాడు యశస్వి జైస్వాల్ – అసిత ఫెర్నాండో మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఐసీసీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ – 1ను ఉల్లంఘించినట్లు తేలడంతో యశస్వితోపాటు ఫెర్నాండోకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ ఇచ్చింది. తొలి రోజు ఆటలో యశస్వి జైస్వాల్ ఔట్ చేసిన తర్వాత ఫెర్నాండో అత్యుత్సాహం ప్రదర్శించాడు. దీంతో జైస్వాల్ అతడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో లంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ దూరం తీసుకెళ్లడంతో ఈ గొడవ సద్దుమణిగింది.

16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులు..

# ద్రోణాచార్య అవార్డు గ్రహీతపై పోక్సో కేసు




పదహారేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు జిమ్నాస్టిక్స్ కోచ్‌పై పోక్సో కేసు నమోదైంది. ముంబయికి చెందిన జిమ్నాస్టిక్స్ కోచ్ గణేశ్ ప్రభాకర్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత కావడం గమనార్హం. 45 ఏళ్ల ఈ కోచ్‌పై విలెపార్లే ప్రాంతానికి చెందిన బాలిక ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలైన బాలిక గణేశ్ వద్ద గత కొన్నేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఇటీవల ఆమెకు కోచ్ నుంచి వాట్సప్‌లో మెసేజ్ వచ్చింది. జిమ్నాసియమ్ రావాలని కోచ్ చెప్పడంతో.. బాలిక అక్కడకు వెళ్లింది. అక్కడ ఒంటరిగా ఉన్న గణేశ్ ఆమెను అసభ్యంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అక్కడి నుంచి ఎలాగొలా బయటపడిన ఆ బాలిక కాలేజీకి వెళ్లిపోయింది. అక్కడ ముభావంగా ఉన్న ఆమెను ఓ టీచర్ గమనించి ఆరా తీయగా.. వేధింపుల విషయం బయటపడింది. దీంతో ఆ టీచర్ వెంటనే బాలిక కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. అనంతరం బాధితురాలి కుటుంబం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com